తెలుగుకలం

TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

అనంతపురం | కర్నూలు | కడప | చిత్తూరు | ప్రకాశం | గుంటూరు | విజయవాడ | హైదరాబాద్

సంపుటి : 01 సంచిక : 96 ఎడిటర్. అచుకట్ల ఖాదర్ బాషా పేజిలు : 08 శనివారం 07 - 11 - 2026 వెల రూ. 2 రూ/

కొడంగల్ అభివృద్ధికి
సీఎం రేవంత్ రెడ్డి మెగా ప్లాన్

- నేటి నుంచి మూడ్రోజుల పర్యటన
- సీఎం రేవంత్ రెడ్డి మూడు రోజుల కొడంగల్ పర్యటన ఖరారు
- సుమారు రూ.9100 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం
- రైతు మేళా, పరిశ్రమలు, విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి
- వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ భవనాలు, పోలీస్ స్టేషన్ల ప్రారంభోత్సవాలు
- పర్యటన ముగింపులో భారీ రైతు బహిరంగ సభ ఏర్పాటు



హైదరాబాద్ :

తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. నియోజకవర్గ రూపురేఖలను మార్చే లక్ష్యంతో సుమారు రూ.9,100 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా నవంబర్ 7, 8, 9 తేదీల్లో ఆయన కొడంగల్‌లో కీలక పర్యటన చేపట్టనున్నారు. ఈ మూడు రోజుల పర్యటనలో భాగంగా భారీ ఎత్తున శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్‌ను అధికారులు ఖరారు చేశారు. ఈ పర్యటనలో భాగంగా రెండు రాత్రులు ఆయన కొడంగల్‌లోనే బస చేయనున్నారు. మూడు రోజుల పర్యటన వివరాలు ఇలా ఉన్నాయి.

ఉదయం 11 గంటలకు హకీంపేటలో మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. అనంతరం రైతు మేళాలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శిస్తారు. ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి నిర్వహిస్తారు. పారిశ్రామికవేత్తలతో సమావేశమై, పెట్టుబడుల అవకాశాలపై చర్చిస్తారు. రాత్రికి కొడంగల్‌కు చేరుకుని అక్కడే బస చేస్తారు. - మిగతా 2 లో

60 టీఎంసీలు ఎత్తిపోయొచ్చు
ప్రభుత్వం తీసుకుంది 18 టీఎంసీలే



- రేవంత్ సర్కార్‌పై హరీశ్ ఫైర్
- కరవుకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమన్న హరీశ్‌రావు
- పరిస్థితిని 'రేవంత్ వృష్టి'గా అభివర్ణన
- దేవాదుల నుంచి 18 టీఎంసీలే ఎత్తిపోశారని ఆరోపణ
- కల్వకుర్తి మోటార్లు పూర్తిస్థాయిలో నడపడం లేదని విమర్శ
- పంటల బీమా అమలు చేయలేదని కాంగ్రెస్‌పై ధ్వజం

హైదరాబాద్ :

రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులకు ప్రకృతి కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలే కారణమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు - మిగతా 2 లో



కుర్చీలో ఆర్టీసీ డీఎం, నేలపై కార్మికులు
మంత్రి పొన్నం సీరియస్!

- సిద్దిపేట ఆర్టీసీ డీఎం వ్యవహారశైలిపై మంత్రి పొన్నం ఆగ్రహం!
- కార్మికులను నేలపై కూర్చోబెట్టిన ఘటనపై విచారణకు ఆదేశం
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఎండీకి సూచన
- కార్మికుల ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తే సహించబోమని హెచ్చరిక

హైదరాబాద్ :

సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ (డీఎం) వ్యవహారశైలిపై తెలంగాణ - మిగతా 2 లో

కర్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో అగ్నిప్రమాదం

- నాలుగు బోగీలకు మంటలు
- ప్రయాణికుల్లో తీవ్ర భయాందోళనలు!
- పంజాబ్‌లో కర్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో అగ్నిప్రమాదం
- నాలుగు బోగీలకు వ్యాపించిన మంటలు
- ఇంజిన్ నుంచి ఐదో బోగీలో తొలుత మంటలు
- సరాయ్ బంజారా స్టేషన్ సమీపంలో ఘటన
- షార్ట్ సర్క్యూట్ కారణమై ఉండొచ్చని అనుమానం

ఢిల్లీ :

అమృత్‌సర్ నుంచి న్యూ జల్పాయ్‌గురి వెళుతున్న కర్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో శుక్రవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. రైలులోని నాలుగు బోగీలకు మంటలు వ్యాపించడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. అయితే ఈ ఘటనలో ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం, గాయాలు సంభవించినట్లు సమాచారం లేదు.రైలు నంబర్ 12508 కర్మభూమి ఎక్స్‌ప్రెస్ - మిగతా 2 లో



భారత్ అమ్ములపొదిలో మరో అస్త్రం..
'ప్రళయ్' పరీక్ష సక్సెస్



- ఒడిశా తీరంలో ప్రయోగాన్ని నిర్వహించిన డీఆర్‌డీవో
- స్వదేశీ రక్షణ సామర్థ్యంలో మరో మైలురాయిగా అభివర్ణన
- గత నెలలో హై-ఆల్టిట్యూడ్ ప్లాట్‌ఫామ్ సిస్టమ్ పరీక్ష కూడా సక్సెస్
- 21 కిలోమీటర్ల ఎత్తులో ప్రయాణించి సత్తా చాటిన హెచ్ఏపీఎస్

ఢిల్లీ :

భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) మరో కీలక విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే 'ప్రళయ్' క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరంలో గురువారం ఉదయం 11:10 గంటలకు ఈ ప్రయోగాన్ని నిర్వహించినట్లు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధికారికంగా ప్రకటించారు.ఈ ప్రయోగంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. - మిగతా 2 లో

రుషికొండ తీరంలో
హోవర్ క్రాఫ్ట్‌ల సందడి

- విశాఖ సముద్ర తీరంలో హోవర్ క్రాఫ్ట్‌లు సందడి చేశాయి
- రుషికొండ బీచ్‌లో ఆకస్మికంగా ఆగిన రెండు కోస్ట్ గార్డ్ హోవర్‌క్రాఫ్ట్‌లు
- ప్రతికూల వాతావరణం కారణంగా ఇంధనం కోసం తాత్కాలిక విరామం
- అరుదైన దృశ్యాన్ని చూసేందుకు భారీగా తరలివచ్చిన పర్యాటకులు, స్థానికులు
- పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఈ నౌకలు నీరు, ఇసుకపై ప్రయాణిస్తాయి



విశాఖపట్నం :

విశాఖ సముద్ర తీరంలో హోవర్ క్రాఫ్ట్‌లు సందడి చేశాయి. వీటిని తిలకించేందుకు రుషికొండకు సందర్శకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కోస్ట్‌గార్డుల విధుల నిమిత్తం గోవా నుంచి పశ్చిమ బెంగాల్‌కు వెళ్తున్న రెండు అధునాతన రక్షణ హోవర్ క్రాఫ్ట్‌లు ప్రతికూల వాతావరణం, తుపాను గాలుల కారణంగా తీరం - మిగతా 2 లో

హ్యాకర్లను మించిపోయే
'జీపీటీ-6' లాంచ్ చేసిన ఓపెన్‌ఏఐ

- ఓపెన్‌ఏఐ నుంచి కొత్త ఏఐ మోడల్ జీపీటీ-6 సైబర్ విడుదల
- సాఫ్ట్‌వేర్‌లలో భద్రతా లోపాలను గుర్తించేందుకు దీని రూపకల్పన
- ఫైర్‌ఫాక్స్, లైనక్స్‌లో పందలాది కొత్త లోపాలను గుర్తించిన ఏఐ
- దీనికి 'క్రిటికల్' రేటింగ్.. ఎంపిక చేసిన నిపుణులకే యాక్సెస్
- సైబర్ నేరగాళ్ల నుంచి రక్షణ కోసమే ఈ టూల్ అంటున్న ఓపెన్‌ఏఐ - మిగతా 2 లో

నేడే ఆంధ్రప్రదేశ్
పరిషత్ తీర్పు



- మ.3 గంటల వరకు ఫలితాలు వెల్లడయ్యే అవకాశం
- రాష్ట్రంలో నేడు జరిగే పరిషత్ ఎన్నికల కౌంటింగ్ పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు

అమరావతి :

ఏపీలో జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో 70.02శాతం పోలింగ్ నమోదైనట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. విశాఖ జిల్లాలో నాలుగు జడ్పీటీసీ స్థానాలు ఉండగా అత్యధికంగా 82.51 శాతం, అత్యల్పంగా అల్లూరి - మిగతా 2 లో



70కి పైగా
అవమానాలు భరించా!

- రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి
- కొత్త రాజకీయ పార్టీ స్థాపిస్తున్న విజయసాయిరెడ్డి
- ఈ నెల 11న పార్టీ ఆవిర్భావం
- పలువురు నేతలు పార్టీలో చేరిక
- రెండు కుటుంబాల పాలనకు ప్రత్యామ్నాయంగా వస్తున్నామన్న మాజీ ఎంపీ
- జగన్ పొమ్మనకుండా పొగబెట్టి బయటకు పంపించారని తీవ్ర ఆరోపణ

అమరావతి :

రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి వైసీపీ అధినేత జగన్ పై మరోసారి తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. తాను స్థాపిస్తున్న కొత్త పార్టీలో పలువురు నాయకులు చేరుతున్న సందర్భంగా విజయసాయిరెడ్డి మీడియా సమావేశం - మిగతా 2 లో

మొన్నటివరకు ఎల్‌నినో
ఇప్పుడు తుపాన్లు దెబ్బతీశాయి

- తుపాను ప్రభావిత ప్రాంతాల్లో చంద్రబాబు పర్యటన
- వరద ప్రభావంతో పంట నష్టపోయిన రైతులతో స్వయంగా మాట్లాడిన సీఎం
- తుపానుల నష్టాన్ని అంచనా వేస్తున్నాం, ప్రతి రైతునూ ఆదుకుంటామమని భరోసా
- పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీతో నష్టపోయిన పెట్టుబడి అందిస్తామని వెల్లడి
- తుపానుల వేళ గత ప్రభుత్వం రెడ్ కార్పెట్ పర్యటనలు చేసిందని విమర్శలు
- నీటి భద్రత, సమర్థ నీటి నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఉద్ఘాటన



అమరావతి :

అర్బుట్, మురసు తుపాన్ల బాగా దెబ్బతీసిందని సీఎం చంద్రబాబు అన్నారు. కానీ తుపాన్ల వల్ల నష్టం తగ్గించేందుకు ముందు జాగ్రత్తలు తీసుకున్నామని ప్రాణ, ఆస్తి నష్టం బాగా తగ్గించగలిగామని చెప్పారు. గుంటూరు, బాపట్ల జిల్లాల సరిహద్దుల్లో మురసు తుపాను మిగిల్చిన నష్టాన్ని చంద్రబాబు స్వయంగా పరిశీలించారు. హెలికాప్టర్‌లో సూర్యలంక ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో సీఎం చంద్రబాబు దిగారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన బాపట్ల మండలం జిల్లెలమూడి వంతెన వద్దకు వెళ్లారు. మురసు తుపాను కారణంగా నల్లమడ వాగుకు గండ్లు పడిన ప్రాంతాన్ని పరిశీలించారు.నల్లమడ వాగుకు పడిన గండ్లు దెబ్బతిన్న ప్రాంతాలను ఫొటోల ద్వారా నీటిపారుదలశాఖ ఎస్ఈ వెంకటరత్నం చంద్రబాబుకు వివరించారు. తరచూ వస్తున్న వరదలు, చేపట్టాల్సిన కార్యాచరణను సీఎం దృష్టికి తీసుకొచ్చారు. అధికారులకు పలు సూచనలు చేసిన ముఖ్యమంత్రి వరద నీరు సద్వినియోగం చేసుకునే విషయం ఆలోచించాలని స్పష్టం చేశారు.అక్కడి నుంచి గుంటూరు జిల్లా రేటూరు గ్రామానికి సీఎం వెళ్లారు. రేటూరు గ్రామంలో పంట నష్టాన్ని సీఎం ప్రత్యక్షంగా పరిశీలించారు. వరద ప్రభావంతో పంట నష్టపోయిన రైతులతో సీఎం చంద్రబాబు మాట్లాడారు. - మిగతా 2 లో

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
శనివారం 07 - 11 - 2026

సంపాదకీయం

ఎన్నారై వేషాలకు చెక్!



విదేశాల్లో కొలువనీ, లక్షల్లో జీతమనీ, అక్కడ కులాసా జీవితమనీ కబుర్లు చెప్పి పెళ్లాడి తీరా అక్కడికెళ్లాక నరకం చూపించేవారికి, అక్కడి కోర్టుల్లో సులభంగా విడాకులు తీసుకునేవారికి సర్వోన్నత న్యాయస్థానం ఝులక్ ఇచ్చింది. అలాంటి విడాకులు ఇక్కడ చెల్లుబాటుకావనీ, ఆ ప్రాతిపదికన చేసుకునే మారు వివాహం బహుభార్యత్వం కింద నేరమే అవుతుందనీ మంగళవారం జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ శ్రీచంద్రశేఖర్‌ల ధర్మాసనం స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని సత్తెనపల్లి వైద్యుడొకరు అక్కడి న్యాయస్థానం మంజూరు చేసిన విడాకుల ఆధారంగా రెండో పెళ్లి చేసుకున్న ఉదంతంలో ఈ తీర్పు వెలువడింది.పెళ్లి చేసుకుని ఎన్నో కలలతో విదేశాలకెళ్లే యువతులు సమస్యలు ఎదుర్కొనటం అంతకుముందూ ఉండొచ్చుగానీ... 90వ దశకంలో సాఫ్ట్‌వేర్ రంగం అభివృద్ధి చెందాక ఈ మాదిరి కేసుల సంఖ్య పెరుగుతోంది. ఎన్నోవిధాల వాకబుచేసి, కుటుంబ నేపథ్యం గురించి తెలుసుకుని చేసే పెళ్లిళ్లు సైతం ఏవేవో కారణాలతో పెటాకులవుతున్నాయి. ఊహించని ఈ పరిణామాలతో మధ్యతరగతి తల్లిదండ్రులుబెంగటిల్లి ఏం చేయాలో తోచక అవస్థలు పడుతున్నారు. మధ్యవర్తుల ద్వారానో, స్వయంగానో పరిష్కరిద్దామంటే దేశంకాని దేశంలో ఉండే అల్లుళ్లు ఫోన్‌కు కూడా దొరక్కుండా తప్పించుకు తిరుగుతున్నారు. వెళ్లటం దుర్లభమై, వెళ్లినా ఫలితం ఉంటుందన్న ఆశ కూడా లేక అలాంటివారు కుమిలిపోతున్నారు. ఈ బాపతు యువకుల్లో రకరకాలవారుంటారు. విమానం ఎక్కేవరకూ ఒకలా ఉండి, అటుతర్వాత అదనపు కట్నం ఆశించో, ఇతరే తరమైన ఆలోచనలతోనో ఆడపిల్లల్ని చిత్రహింసలపాలు చేస్తున్నారు. మరికొందరుపెళ్లి చేసుకుని, ముచ్చట్లన్నీ తీర్చుకుని మళ్లీ వచ్చి తీసుకెళ్తామంటూ కథలు చెప్పి మాయమవుతున్నారు. ఇలాంటి ఉదంతాల్లో వస్తున్న ఫిర్యాదుల సంఖ్య అంతకంతకు పెరగటంతో కేంద్ర ప్రభుత్వం 2018లోనే భారతీయ శిక్షాస్మృతిలో అవసరమైన నిబంధ నలు చేర్చాలని నిర్ణయించింది. రెండేళ్లక్రితం క్రిమినల్ చట్టాల స్థానంలో కొత్త చట్టాలొచ్చాయి. కానీ సివిల్ ప్రొసీజర్ కోడ్ (సీపీసీ) మాత్రం యథాతథంగా కొనసాగుతోంది. అందులోని సెక్షన్ 13 విదేశీ న్యాయస్థానాల ద్వారా పొందే విడాకులు ఇక్కడ చెల్లుబాటు కావని చాలా స్పష్టంగా చెప్పింది. ఆ తీర్పుల ఆధారంగా మరో పెళ్లి చేసుకుంటే భారతీయ చట్టాల దృష్టిలో అది చెల్లుబాటుకాదని ఆ నిబంధన చెబుతోంది. అలాంటివారిపై బహుభార్యత్వం కింద భారతీయ శిక్షాస్మృతిలోని 494 కింద కేసు నమోదు చేయొచ్చని ఆ నిబంధన అంటున్నది. ఇప్పుడు సుప్రీంకోర్టు దాన్నే మరోసారి చెప్పింది. ఈ దేశంలో పెళ్లాడి, ఇక్కడ కొంతకాలం గడిపి వెళ్లేవారెవరైనా ఇక్కడి చట్టాల ఆధారంగా ఫ్యామిలీ కోర్టుల్లో మాత్రమే పిటిషన్లు దాఖలుచేసి విడాకులు పొందాలని వివరించింది.సత్తెనపల్లివాసి అతి తెలివికి పోయాడు. భార్య కాన్పు కోసం భారత్ తిరిగిరావటాన్ని ఆసరా చేసుకుని శాశ్వతంగా ఆమెను వదిలించుకునే ఎత్తుగడ పన్నాడు. దాంపత్యజీవితంలో పొరపొచ్చాలు వచ్చాయి గనుక విడాకులిప్పించాలంటూ నర్సరావుపేట కోర్టులో వేసిన పిటిషన్ తోసిపుచ్చడంతో హైకోర్టును ఆశ్రయించాడు. అక్కడా తనకు అనుకూలంగా తీర్పు రాకపోవటంతో బ్రిటన్ పౌరసత్వం వచ్చేవరకూ ఆగి అక్కడికేంబ్రిడ్జి కౌంటీ కోర్టులో విడాకులు పొందాడు. చాలామంది ఎన్నారైలు చేసే పని ఇదే. కానీ హిందూ వివాహ చట్ట నిబంధనల ప్రకారం వివాహమాడినవారు వేరే దేశాల కోర్టుల్లో విడాకులు పొందినా చెల్లుబాటుకాదని గతంలోనూ కోర్టులు చెప్పాయి. విదేశీ యులకు వెసులుబాటిచ్చే ఐపీసీలోని సెక్షన్ 4 వర్తించబోదని కూడా స్పష్టంచేశాయి.ఇలాంటి కేసుల్లో అనుసరించదగిన నియమాలను 1991లోనే సుప్రీంకోర్టు నిర్ధారించింది. కానీ ఏదో వంకన దీర్ఘకాలం వ్యాజ్యం కొనసాగిస్తూ అత్తింటివారిని ఆర్థికంగా దెబ్బతీస్తే, విసుగుచెంది రాజీ మార్గానికొస్తారని, సులభంగా వదిలించుకోవచ్చని చాలామంది భావిస్తున్నారు. గత దశాబ్దకాలంలో ఈ మాదిరి ఎన్నారై విడాకుల కేసులు 35 శాతం మేర పెరిగాయని గణాంకాలు చెబుతున్నాయి. వాటిల్లో న్యాయస్థానాల పరిధి ప్రశ్నార్థకమైన కేసులే 60 శాతం పైగా ఉన్నాయి. ఇలాంటి వంచకుల ఆటకట్టించే క్రమంలో తాజా సుప్రీంకోర్టు తీర్పు ఒక ముందడుగు.

మొన్నటివరకు ఎల్‌నినో ఇప్పుడు తుపాన్లు దెబ్బతీశాయి

మొదటిపేజీ తరువాయి - పాడైపోయిన వరిపంటను తెచ్చి రైతులు చూపించారు. మరికొద్ది రోజుల్లో పంట చేతికొస్తుందనుకుంటే వరదతో పూర్తిగా కోల్పోయాని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లమడ వాగు వరద గేట్లు పాడైపోయాయని రైతులు చెప్పగా స్పందించిన సీఎం మరమ్మతులు చేయించాలని లేదా కొత్త వాటికి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. రైతులు పంటల బీమా తప్పనిసరిగా చేయించాలని సూచించారు.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో రైతులు బాగా నష్టపోయారని అన్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల, కోనసీమ జిల్లాల్లో భారీవర్షాలు పడ్డాయని తెలిపారు. తుపాన్ల వల్ల కోస్తా రైతులు తరచుగా నష్టపోతున్నారని మొన్నటి వరకు ఎల్‌నినోతో ఇబ్బందులు ఇప్పుడు తుపాన్లు దెబ్బతీశాయని పేర్కొన్నారు. భారీ వర్షాలు పడటంతో సమర్థంగా నీటినిర్వహణ చేపట్టామని తెలిపారు. ఉన్నతాధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు పని చేశారని ప్రతి రెండు గంటలకు ఒకసారి అందరినీ అప్రమత్తం చేశామని అన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించమని అలానే పంటలబీమాను తప్పకుండా కట్టాలని ప్రతి రైతును కోరుతున్నానని సీఎం చంద్రబాబు అన్నారు.

నేడే ఆంధ్రప్రదేశ్ పరిషత్ తీర్పు

మొదటిపేజీ తరువాయి - జిల్లాలో 62.01 శాతం పోలింగ్ నమోదైంది. శ్రీకాకుళం జిల్లాలో 65.51, అనకాపల్లి 75.58, అనంతపురం 64.38, అన్నమయ్య 69.19, చిత్తూరు 76.30, బాపట్ల 67.47, కృష్ణా జిల్లా 73.21, కోనసీమ జిల్లాలో 66.33 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.రాష్ట్రంలో నేడు జరిగే పరిషత్ ఎన్నికల కౌంటింగ్ పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. రీపోలింగ్ జరుగుతున్న చోట్ల కూడా త్వరితగతిన ప్రక్రియ పూర్తి చేసి రేపే ఫలితాలు వెల్లడిస్తామని చెప్పారు. మధ్యాహ్నం 3 గంటల్లోగా కౌంటింగ్ పూర్తయ్యే అవకాశం ఉందన్నారు.'ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు పోటీపడ్డ వేల మంది అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్స్‌లో నిక్షిప్తమై ఉంది. జయాపజయాలు మాట ఎలా ఉన్నప్పటికీ పోలింగ్ ప్రక్రియ ఎంత సజావుగా సాగిందో అంతకంటే క్రమ పద్ధతిలో కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు 28 జిల్లాల్లో అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది.దాదాపు 30 వేల మందికి పైగా సిబ్బంది ఈ కౌంటింగ్ ప్రక్రియలో ప్రత్యక్షంగా పాల్గొంటారు. వేల సంఖ్యలో పోలీస్ బందోబస్తు కూడా ఈ కౌంటింగ్ కేంద్రాల దగ్గర ఉంటుంది ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్?తో ప్రారంభమయ్యే కౌంటింగ్ తొలి ఫలితం వచ్చేసరికి కనీసం నాలుగు గంటలు సమయం పడుతుందని అంచనా వేస్తున్నాం.

కర్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో అగ్నిప్రమాదం



మొదటిపేజీ తరువాయి - అమృత్‌సర్ నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే పంజాబ్‌లోని సరాయ్ బంజారా రైల్వే స్టేషన్ సమీపంలో మంటలు చెలరేగాయి. ఇంజిన్ నుంచి లెక్కిస్తే ఐదో బోగీలో తొలుత మంటలు కనిపించాయి. ఆ తర్వాత మరో మూడు బోగీలకూ వ్యాపించాయి.సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, అత్యవసర సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బోగీల నుంచి మంటలు, దట్టమైన పొగలు వెలువడుతున్న దృశ్యాలు బయటకు వచ్చాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగి ఉండొచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. అయితే ప్రమాదానికి కచ్చితమైన కారణం ఇంకా అధికారికంగా నిర్ధారణ కాలేదు. ఘటనపై రైల్వే అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

రుషికొండ తీరంలో హోవర్ క్రాఫ్ట్‌ల సందడి



మొదటిపేజీ తరువాయి - వెంబడి ఆగుతూ ప్రయాణిస్తున్నాయని రుషికొండ మెరైన్ సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. కోస్ట్‌గార్డ్ విధుల నిమిత్తం గోవా నుంచి పశ్చిమ బెంగాల్‌కు వెళ్తుంది.ప్రయాణంలో భాగంగా కేవలం ఇంధనం నింపుకొనే నిమిత్తమే వీటిని తాత్కాలికంగా విశాఖలోని రుషికొండ సముద్రతీరానికి తీసుకొచ్చారన్నారు. ముఖ్యంగా తీర ప్రాంతంలో అక్రమ రవాణాను అడ్డుకోవడానికి అత్యంత పటిష్ఠ నిఘా కోసమే వీటిని ఉపయోగిస్తారని తెలిపారు. ఇవి నీటిపైనే కాకుండా ఇసుకలో కూడా సునాయాసనంగా దూసుకుపోవడాన్ని ప్రత్యక్షంగా చూసిన పర్యాటకులు, పిల్లలు తీవ్ర ఆశ్చర్యానికి గురయ్యారు.ఈ అరుదైన నౌకలను తిలకించేందుకు సందర్శకులు పెద్ద ఎత్తున అమితాసక్తి చూపడంతో రుషికొండ తీరమంతా ఒక్కసారిగా కోలాహలంగా మారి తీవ్ర సందడి నెలకొంది. ప్రతికూల వాతావరణం, తుపాను గాలుల కారణంగా తీరం వెంబడి ఆగుతూ ప్రయాణిస్తున్నాయని రుషికొండ మెరైన్ సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపారు. ప్రయాణంలో భాగంగా ఇంధనం నింపుకొనే నిమిత్తమే వీటిని తాత్కాలికంగా రుషికొండ తీరానికి తీసుకొచ్చినట్లు తెలిపారు. తిరిగి శుక్రవారం ఉదయాన్నే ఇవి పశ్చిమ బెంగాల్‌కు బయలుదేరుతాయని ఆయన పేర్కొన్నారు. తీర ప్రాంతాల్లో అక్రమ రవాణాను అడ్డుకోవడానికి, అత్యంత పటిష్ట నిఘా కోసమే ఈ వాహనాలను వినియోగించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.తుపాను కారణంగా కురిసిన వర్షాలకు సముద్రం ఉగ్ర రూపం దాల్చింది. ఇన్ని రోజులు తీరం సందర్శకులు లేక వెలవెలబోయింది. ప్రస్తుతం హోవర్ క్రాఫ్ట్‌ల రాకతో రుషికొండ బీచ్?కు సందర్శకులు భారీ ఎత్తున తరలి వచ్చారు. వారి రాకతో అక్కడ వాతావరణమంతా కోలాహలంగా మారింది. పిల్లల నుంచి పెద్దల వరకూ అందరూ హోవర్ క్రాఫ్ట్‌లను చూసి ఆశ్చర్యపోయారు.

హ్యాకర్లను మించిపోయే 'జీపీటీ-6' లాంచ్ చేసిన ఓపెన్‌ఏఐ



మొదటిపేజీ తరువాయి - ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో అగ్రగామి సంస్థ ఓపెన్‌ఏఐ, సైబర్ సెక్యూరిటీ ప్రపంచంలో ఒక సంచలనాత్మక ముందడుగు వేసింది. సాఫ్ట్‌వేర్, ఆపరేటింగ్ సిస్టమ్‌లలో ఉండే భద్రతా లోపాలను గుర్తించి, వాటిని ఎలా హ్యాక్ చేయవచ్చో కూడా పరీక్షించగల శక్తివంతమైన ఏఐ మోడల్ 'జీపీటీ-6 సైబర్'ను విడుదల చేసింది. ఈ ఏఐ మోడల్ సామర్థ్యం దృష్ట్యా, దీనికి తన సేఫ్టీ ఫ్రేమ్‌వర్క్‌లో 'క్రిటికల్' (అత్యంత కీలకమైన) రేటింగ్ ఇచ్చింది.గురువారం (నవంబర్ 5) ఎంపిక చేసిన కొద్దిమంది నిపుణులకు అందుబాటులోకి తెచ్చిన ఈ మోడల్, ఇప్పటికే తన సత్తా చాటింది. ఫైర్‌ఫాక్స్ బ్రౌజర్‌లో ఇప్పటివరకూ ఎవరికీ తెలియని 81 తీవ్రమైన భద్రతా లోపాలను ఇది గుర్తించింది. ఈ సమాచారంతో మోజిల్లా సంస్థ ఇప్పటికే పరిష్కార చర్యలు ప్రారంభించింది. అంతేకాకుండా, లైనక్స్ కెర్నల్‌లో 948 లోపాలను ఇది కనుగొనగా, వాటిలో 588 ఇంతకుముందు తెలియనివి కావడం గమనార్హం. వీటిలో 304 కీలకమైన లోపాల వివరాలను, వాటికి పరిష్కార మార్గాలతో సహా ఓపెన్‌ఏఐ సంబంధిత డెవలపర్‌లకు అందించింది.జీపీటీ-6 సైబర్ శక్తిసామర్థ్యాల కారణంగా, దీనిని అందరికీ అందుబాటులో ఉంచడం లేదు. కేవలం అధునాతన సైబర్ సెక్యూరిటీ పరిశోధనల కోసం ఉద్దేశించిన 'డేబ్రేక్ రెడ్' అనే ప్రత్యేక ప్లాట్‌ఫామ్‌పై, ఎంపిక చేసిన కస్టమర్లకు మాత్రమే యాక్సెస్ కల్పించారు. రాబోయే వారాల్లో ఈ ప్లాట్‌ఫామ్‌లోని అధీకృత నిపుణులందరికీ దీనిని అందు బాటులోకి తీసుకురానున్నట్లు ఓపెన్‌ఏఐ తెలిపింది. దీని పాత వెర్షన్ అయిన జీపీటీ-5.6 సైబర్‌ను కూడా గురువారం నుంచి డేబ్రేక్ రెడ్ కస్టమర్లందరికీ అందుబాటులోకి తెచ్చారు. హ్యాకర్లు, సైబర్ నేరగాళ్లు ఏఐని దుర్వినియోగం చేసే ప్రయత్నాలు పెరుగుతున్నాయని ఓపెన్‌ఏఐ అంగీకరించింది. ఈ నేపథ్యంలో, నేరగాళ్ల కంటే ముందుగానే భద్రతా నిపుణులు లోపాలను గుర్తించి, సరిదిద్దేందుకు ఒక శక్తివంతమైన సాధనంగా జీపీటీ-6 సైబర్‌ను అందిస్తున్నట్లు స్పష్టం చేసింది.

భారత్ అమ్ములపొదిలో మరో అస్త్రం.. 'ప్రళయ్' పరీక్ష సక్సెస్



మొదటిపేజీ తరువాయి - "వినియోగదారుల మూల్యాంకన పరీక్షల్లో భాగంగా ఈ ప్రయోగం జరిగింది. నిర్దేశించిన అన్ని లక్ష్యాలను ఇది విజయవంతంగా పూర్తి చేసింది. వివిధ రేంజ్ సాధనాల ద్వారా సేకరించిన డేటా ఈ విషయాన్ని ధ్రువీకరించింది" అని ఆయన తెలిపారు. స్వదేశీ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేయడంలో ఈ విజయం మరో ముఖ్యమైన మైలురాయి అని ఆయన పేర్కొన్నారు.డీఆర్‌డీవో గత నెలలో కూడా మరో ఘనతను సొంతం చేసుకుంది. దేశీయంగా అభివృద్ధి చేసిన హై-ఆల్టిట్యూడ్ ప్లాట్‌ఫామ్ సిస్టమ్ (హెచ్‌ఏపీఎస్) విమాన ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు ప్రకటించింది. ఈ ప్రయోగంలో భాగంగా హెచ్‌ఏపీఎస్ 21 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకుని, సుదీర్ఘ సమయం పాటు స్ట్రాటోస్ఫియర్‌లో ప్రయాణించే సామర్థ్యాన్ని ప్రదర్శించింది. రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ ప్రయోగాత్మక విమానం సముద్ర మట్టానికి 21 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకుంది. ఆ తర్వాత సుమారు 20 కిలోమీటర్ల ఎత్తులో 30 నిమిషాలకు పైగా నిలకడగా ప్రయాణించింది. నిరంతర నిఘా, కమ్యూనికేషన్లు, పర్యవేక్షణ వంటి కార్యకలాపాలకు స్ట్రాటోస్ఫియర్ ఎంతో అనుకూలమైన ప్రాంతం కాగా, ఆ ఎత్తులో పనిచేసే సామర్థ్యాన్ని ఈ వ్యవస్థ నిరూపించింది. ప్రయోగ సమయంలో ఎయిర్‌బోర్న్ ప్లాట్‌ఫామ్ నుంచి గ్రౌండ్ కంట్రోల్ స్టేషన్‌కు రియల్ టైమ్ వీడియో, వాహన పనితీరు డేటా నిరంతరం ప్రసారమైంది.ఈ వ్యవస్థలో ఇనర్షియల్ మెజర్‌మెంట్ యూనిట్, జీపీఎస్ రిసీవర్, ఆన్‌బోర్డ్ కెమెరాలు, ఎత్తును నియంత్రించే యంత్రాంగాలు వంటి అనేక పరికరాలను అమర్చారు. ఈ ఉప వ్యవస్థలన్నీ మిషన్ అంతటా సక్రమంగా పనిచేశాయని అధికారులు తెలిపారు. భారత వైమానిక దళం, సెంటర్ ఫర్ మిలిటరీ ఎయిర్‌వర్తీనెస్ అండ్ సర్టిఫికేషన్, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వంటి పలు ఏజెన్సీల సమన్వయంతో ఈ ప్రయోగాన్ని నిర్వహించారు.

కొడంగల్ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి మెగా ప్లాన్



మొదటిపేజీ తరువాయి - నవంబర్ 8 (ఆదివారం):

హకీంపేటలో స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమవుతారు.

ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు.

హకీంపేటలో నూతనంగా నిర్మించిన పాఠశాల, జూనియర్ కళాశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ూనజ) భవనాలను ప్రారంభిస్తారు.

బొంరాస్‌పేట, కొడంగల్, దుద్యాల మండలాల్లో పోలీస్ స్టేషన్లు, ఇతర ప్రభుత్వ భవనాలను ప్రారంభిస్తారు.

నాచారం వద్ద రూ.5,060 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న రేడియల్ రోడ్డు-2 పనులకు శంకుస్థాపన చేస్తారు.

కోస్గిలో సైన్స్ మ్యూజియం, దౌలతాబాద్‌లో జూనియర్ కళాశాల, బాలంపేటలో పీహెచ్‌సీని ప్రారంభిస్తారు.

రాత్రి కొడంగల్‌లోనే బస చేస్తారు.

ఈ మూడు రోజుల పర్యటనలో మొత్తం రూ.9,053.48 కోట్ల విలువైన 13 కీలక అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేయనున్నారు.

పర్యటన ముగింపులో భాగంగా హకీంపేటలో ఏర్పాటు చేసే భారీ రైతు బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు.ఈ పర్యటన ద్వారా కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టమవుతోంది.

60 టీఎంసీలు ఎత్తిపోయొచ్చు.. ప్రభుత్వం తీసుకుంది 18 టీఎంసీలే



మొదటిపేజీ తరువాయి - విమర్శించారు. "ఇది అతివృష్టి కాదు.. అనావృష్టి కాదు.. రేవంత్ వృష్టి" అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నదుల్లో పుష్కలంగా నీళ్లున్నా.. పంపులు నడిపి పొలాలకు నీటిని అందించలేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ వైఫల్యాలను ఆధారాలతో సహా ఎండగడతామని హెచ్చరించారు.దేవాదుల ప్రాజెక్టు ద్వారా 60 టీఎంసీల నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నా.. ప్రభుత్వం కేవలం 18 టీఎంసీలకే పరిమితమైందని హరీశ్‌రావు ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి నీటిని దిగువకు వదిలేస్తుంటే.. ఏపీ సీఎం చంద్రబాబు వాటిని ఒడిసిపట్టుకుంటున్నారని వ్యాఖ్యానించారు. శ్రీశైలంలో తగినంత నీరు ఉన్నా కల్వకుర్తి ఎత్తిపోతల పథకం వద్ద పూర్తిస్థాయిలో మోటార్లు నడపడం లేదని విమర్శించారు. మరోవైపు చంద్రబాబు 700 కిలోమీటర్ల దూరంలోని కుప్పం వరకు నీటిని తరలించుకుపోయారని పేర్కొన్నారు.గ్లోబల్ వార్మింగ్, ఎల్‌నినో ప్రభావం ఉండొచ్చని శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదని హరీశ్‌రావు ఆరోపించారు. ఎన్నికల సమయంలో పంటల బీమాపై హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నేతలు.. అధికారంలోకి వచ్చాక దాన్ని అమలు చేయడం మరిచిపోయారని విమర్శించారు. పంటల బీమా అమల్లో ఉంటే రైతులకు కొంతైనా నష్టపరిహారం అందేదని అన్నారు. కర్ణాటక, మహారాష్ట్రలో కరవు సాయం కింద ఎకరాకు రూ.5 వేల చొప్పున రైతులకు అందిస్తున్నారని గుర్తుచేశారు.రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. ఇంతటి తీవ్రమైన పరిస్థితి ఉన్నా కనీసం క్యాబినెట్ సమావేశంలోనూ దీనిపై చర్చించకపోవడం దారుణమని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలోకరవు పరిస్థితులు ఏర్పడ్డాయని ఆరోపించారు.

కుర్చీలో ఆర్టీసీ డీఎం, నేలపై కార్మికులు.. మంత్రి పొన్నం సీరియస్!



మొదటిపేజీ తరువాయి - రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. కార్మికులతో సమావేశమైన సమయంలో డీఎం కుర్చీలో కూర్చోగా, కార్మికులు నేలపై కూర్చున్నట్లుగా ప్రచారంలోకి వచ్చిన ఘటనపై ఆయన పూర్తిస్థాయి విచారణకు ఆదేశించారు. ఈ మేరకు ఆర్టీసీ ఎండీతో మాట్లాడి, ఘటనకు బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ విషయంపై మంత్రి పొన్నం ప్రభాకర్ సోషల్ మీడియాలో స్పందిస్తూ.. "సిద్దిపేట డిపోలో జరిగిన ఘటన నా దృష్టికి వచ్చింది. ఈ అంశంపై తక్షణమే ఆర్టీసీ ఎండీతో మాట్లాడి, సమగ్ర విచారణ జరిపించాలని ఆదేశించాను. విచారణలో బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు ఉంటాయి" అని తెలిపారు.ప్రజా పాలన ప్రభుత్వంలో కార్మికుల సంక్షేమానికి, వారి ఆత్మగౌరవానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన పునరుద్ఘాటించారు. "ఆర్టీసీ సంస్థ అభివృద్ధిలో కార్మికుల పాత్ర ఎంతో కీలకం. సంస్థ కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్మికులను గౌరవంగా చూడాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉంది. వారి ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా ఎవరు వ్యవహరించినా సహించే ప్రసక్తే లేదు" అని మంత్రి స్పష్టం చేశారు.కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా, అగౌరవంగా ప్రవర్తించే అధికారులపై భవిష్యత్తులో కఠిన చర్యలు తప్పవని పొన్నం ప్రభాకర్ గట్టిగా హెచ్చరించారు. అధికారులు తమ పరిధిలో కార్మికులతో గౌరవప్రదంగా, బాధ్యతాయుతంగా మెలగాలని ఆయన హితవు పలికారు.ద

ఒకటి కాదు రెండు కాదు.. 70కి పైగా అవమానాలు భరించా!

మొదటిపేజీ తరువాయి - ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ నుంచి తనను జగన్ అవమానించి బయటకు పంపించారని, పొమ్మనకుండా పొగబెట్టారని సంచలన ఆరోపణలు చేశారు.ఈ నెల 11వ తేదీన తన కొత్త పార్టీ ఆవిర్భావం ఉంటుందని స్పష్టం చేశారు. కొత్త పార్టీలో చేరికలను స్వాగతించారు. విశ్వ హిందూ పరిషత్‌లో దశాబ్దాలుగా పనిచేసిన సుమతి రెడ్డి, అనకాపల్లికి చెందిన హిందూ ఎస్సీ, ఎస్టీ కులాల పరిరక్షణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బోని గణేశ్ తమ పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. సుమతి రెడ్డి రాబోయే ఎన్నికల్లో తిరుపతి జిల్లా నుంచి శాసనసభకు పోటీ చేస్తారని, నియోజకవర్గాన్ని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. ఈ చేరికలు తమ పార్టీ సిద్ధాంతానికి నిదర్శనమని, అన్ని కులాలు, మతాలు, వర్గాలకు సమన్యాయం చేయడమే తమ లక్ష్యమని ఆయన ఉద్ఘాటించారు. "రాష్ట్రాన్ని రెండు కుటుంబాల చేతుల్లో పెట్టకూడదు. రాజ్యాంగబద్ధంగా ఎవరి హక్కులు వారికి దక్కాలి. యువతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, అంతర్గత ప్రజాస్వామ్యంతో మా పార్టీ నడుస్తుంది" అని ఆయన వివరించారు.వైసీపీ నుంచి బయటకు రావడానికి గల కారణాలను వివరిస్తూ ఆయన తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. "నేను పార్టీని వదిలి వెళ్ళలేదు, నన్ను బయటకు తోసేశారు. పొమ్మనకుండా పొగబెట్టి, అప్పుడప్పుడు అవమానించి, ఒక మనిషిగా భరించలేనటువంటి పరిస్థితులు కల్పించారు. అందుకే ఆ పార్టీని వీడాల్సి వచ్చింది. స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి గారు నన్నెప్పుడూ అవమానించలేదు. కానీ జగన్ పాలనలోనే ఇది జరిగింది. చెప్పుడు మాటలు విని నన్ను దూరం పెట్టారు" అని ఆవేదన వ్యక్తం చేశారు.ఒకటి రెండు కాదు, 70కి పైగా అవమానాలను భరించానని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే పనులు చేస్తే ఎవరైనా ఎలా ఊరుకుంటారని ప్రశ్నించారు. "ప్రతి మనిషికీ ఆత్మగౌరవం ఉంటుంది. నా ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినప్పుడు ఇక అక్కడ ఉండలేకపోయాను. కూర్చున్న కొమ్మను నరికేసినప్పుడు ఇంకేం చేయగలం? అందుకే బయటకు వచ్చాను" అని అన్నారు.అధికారంలో ఉన్నామని విర్రవీగితే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ ఏకపక్ష వైఖరి ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని ఆయన విమర్శించారు. తాము పెట్టబోయే పార్టీలో ప్రతి ఒక్కరినీ గౌరవంగా చూసుకుంటామని, ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకు వెళ్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర భవిష్యత్తును మార్చే మూడో ప్రత్యామ్నాయంగా తమ పార్టీ నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
శనివారం 07 - 11 - 2026

గెలిచిన వెంటనే ప్రజా సేవలో AIMIM 31వ వార్డులో తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం



రాయదుర్గం (తెలుగు కలం) (నవంబర్ 06) : ఎన్నికల ఫలితాలు వెలువడి రెండు రోజులు కూడా గడవకముందే ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలోకి దిగారు. రాయదుర్గం పట్టణంలోని 31వ వార్డులో శుక్రవారం తీవ్ర తాగునీటి కొరత ఏర్పడటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా శుక్రవారం కావడంతో నీటి అవసరం ఎక్కువగా ఉందని గమనించిన రాయదుర్గం **AIMIM** అధ్యక్షుడు బ్రెడ్ సర్మాస్ వలి, నూతన కౌన్సిలర్ జీ. జీనత్ వెంటనే స్పందించారు.?ప్రజల కష్టాలను గుర్తించి ఆలస్యం చేయకుండా సొంత ఖర్చులతో ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లను రప్పించి వార్డులోని కాలనీల్లో యుద్ధప్రాతిపదికన నీటిని సరఫరా చేయించారు. సర్మాస్ వలి, కౌన్సిలర్ జీనత్ స్వయంగా రంగంలోకి దిగి వార్డులోని ప్రతి గల్లీలో నీటి పంపిణీ ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించారు.?ఈ సందర్భంగా సర్మాస్ వలి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని స్పష్టం చేశారు. కేవలం ఎన్నికలకే పరిమితం కాకుండా, వార్డులో తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల సమస్యలను శాశ్వతంగా, దశలవారీగా పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గెలిచిన వెంటనే తమ సమస్యను గుర్తించి వెంటనే తాగునీరు అందించిన నాయకులకు 31వ వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

గూడూరు వారి వివాహ వేడుకకు హాజరైన పలువురు నాయకులు



యాడికి (తెలుగు కలం) (నవంబర్ 06) : యాడికి మండల కేంద్రంలోని టీటీడీ కళ్యాణ మండపంలో శుక్రవారం జరిగిన గూడూరు ఇంద్రసేనారెడ్డి, సుప్రియల వివాహ వేడుకకు పలువురు నాయకులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వ దించారు.యాడికి మండల పరిధిలోని చింతలాయపల్లి గ్రామానికి చెందిన గూడూరు రోశిరెడ్డి ఆహ్వానం మేరకు యాడికి మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు వివాహ వేడుకకు హాజరయ్యారు.ఈ సంద ర్భంగా నూతన వధూవరులు ఇంద్రసేనారెడ్డి,సుప్రియలను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పిన్నెపల్లి శేఖర్ రెడ్డి, నారాయణ రెడ్డి, భాస్కర్ రెడ్డి, సుబ్బారెడ్డి, రాజారెడ్డి, వెంకటేష్, రామకృష్ణ, కరుణాకర్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

హిందూపురంలో ఫ్లైఓవర్ కింద గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



హిందూపురం (తెలుగు కలం) (నవంబర్ 06) : ప్రతినిధి : హిందూపురం పట్టణ పరిధిలోని కొట్టనూరు రైల్వే గేట్ సమీపంలో ఉన్న ఫ్లైఓవర్ కింద ఒక గుర్తుతెలియని మగ వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందినట్లు అనంతపురం జిఆర్పి (గవర్నమెంట్ రైల్వే పోలీస్) అధికారులు వెల్లడించారు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదని, అతనికి సుమారు 40 నుంచి 45 ఏళ్ల వయస్సు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతుడు శరీరం బాగా లావుగా ఉండి, తెల్లటి ఫుల్ బనియన్, పచ్చ రంగు నైట్ ప్యాంటు ధరించి ఉన్నాడు. ఈ సమాచారాన్ని హిందూపురం మీడియా ద్వారా పట్టణ ప్రజలకు చేరవేస్తూ, మృతుడి ఆచూకీ లేదా గుర్తింపు తెలిసిన వారు ఎవరైనా ఉంటే వెంటనే హిందూపురం జిఆర్పి పోలీసులను సంప్రదించాలని కోరారు. సమాచారం తెలిసిన వారు 92475 75615 అనే ఫోన్ నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు అందించాల్సిందిగా రైల్వే పోలీసులు విజ్ఞప్తి చేశారు.

కళ్యాణదుర్గాన్ని రిగ్గింగ్ దుర్గంగా మార్చొద్దు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగ్రహం



కళ్యాణదుర్గం (తెలుగు కలం) (నవంబర్ 06) : ప్రతినిధి : కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు రిగ్గింగ్ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుస్తున్నారని కంబదూరు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద చోటుచేసుకున్న అవాంఛనీయ ఘటనలను ఖండిస్తూ శుక్రవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే సురేంద్రబాబు అనుచరులు నిబంధనలకు విరుద్ధంగా పోలింగ్ కేంద్రంలోకి చొరబడేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. దాన్ని అడ్డుకున్న తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై ప్రత్యర్థి వర్గం భౌతిక దాడులకు దిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కళ్యాణదుర్గం రాజకీయ చరిత్రలోనే ఇలాంటి దౌర్జన్యకరమైన సంస్కృతి ఎప్పుడూ లేదని స్పష్టం చేశారు. ?ఎన్నికల బరిలో ప్రజాదరణతో, ప్రజల మద్దతు పొంది గెలవాలి తప్ప, ఇలాంటి దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడి విజయాలు సాధించాలనుకోవడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని హితవు పలికారు. రాబోయే రోజుల్లో కళ్యాణదుర్గం ప్రజలే ఈ తరహా అరాచక రాజకీయాలకు తగిన విధంగా గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులతో పాటు పలువురు మండల స్థాయి నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

వేములపాడులో ఉచిత ఛాతీ ఎక్స్‌రే శిబిరం



యాడికి (తెలుగు కలం) (నవంబర్ 06) : క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా యాడికి మండల పరిధిలోని వేములపాడు గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రాయలచెరువు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు దేవరాజన్, అప్పయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో టీబీ సూపర్వైజర్లు మన్సూర్ అలీ,దేవదాస్ సుమారు 70 మందికి ఛాతీ ఎక్స్‌రేలు తీశారు.ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఎక్స్‌రేల ద్వారా క్షయ వ్యాధిని ముందుగానే గుర్తించడంతో పాటు ఊపిరితిత్తులకు సంబంధించిన ఇతర వ్యాధులను కూడా నిర్ధారించవచ్చ ని తెలిపారు.ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు సబితా రాణి,దమయంతి, ఎంఎల్‌హె చ్‌పీ శివచందన,ఆశా కార్యకర్తలు ధనలక్ష్మి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కౌంటింగ్

అనంతపురం జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు





అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 06) : ప్రతినిధి : అనంతపురం జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు-2026 ప్రక్రియ తుది ఘట్టానికి చేరుకుంది. జిల్లాలోని జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల ఓట్ల లెక్కింపునకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లనూ పకడ్బందీగా పూర్తి చేసింది. జిల్లా పరిధిలోని అనంతపురం, గుంతకల్లు, మరియు కళ్యాణదుర్గం అనే 3 రెవెన్యూ డివిజన్లలో మొత్తం 11 కేంద్రాల్లో ఈ కౌంటింగ్ నిర్వహించనున్నారు. లెక్కింపు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

అనంతపురం రెవెన్యూ డివిజన్

అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని 11 మండలాల ఓట్ల లెక్కింపు కోసం 4 కౌంటింగ్ కేంద్రాలను కేటాయించారు. అనంతపురం నగరంలోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కాలేజీలో అనంతపురం, ఆత్మకూరు, బుక్కరాయసముద్రం, రాప్తాడు, మరియు సింగనమల మండలాల లెక్కింపు జరగనుంది. జేఎన్టీయూ యూనివర్సిటీ ప్రాంగణంలో నార్పల, గార్లదిన్నె మండలాల కౌంటింగ్ చేపడుతుండగా, జేఎన్టీయూ కళాశాలలోని మరో కేంద్రంలో పుట్లూరు, ఎల్లనూరు మండలాల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేశారు. తాడిపత్రి పట్టణంలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో తాడిపత్రి, పెద్దపప్పూరు మండలాల ఓట్లను లెక్కిస్తారు.

కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్

కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ పరిధిలో 11 మండలాల కౌంటింగ్ కోసం 3 కేంద్రాలను సిద్ధం చేశారు. కరణం చిక్కప్ప హైస్కూల్‌లో కంబదూరు (రూమ్ నెం. 41, 42), సెట్టూరు (రూమ్ నెం. 45, 46), గుమ్మగట్ట (రూమ్ నెం. 43, 44), మరియు కుందుర్పి (రూమ్ నెం. 32, 34) మండలాల ఓట్లను లెక్కిస్తారు. గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో కళ్యాణదుర్గం (రూమ్ నెం. 6, 7), బెలుగుప్ప (రూమ్ నెం. 2, 5), మరియు బ్రహ్మసముద్రం (మొదటి అంతస్తు రూమ్ నెం. 12, 13) మండలాల కౌంటింగ్ జరగనుంది. ఎస్వీడీఎం గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో బొమ్మనహాల్ (రూమ్ నెం. 24, 25), డి.హీరేహాల్ (రూమ్ నెం. 26, సెమినార్ హాల్), రాయదుర్గం (రూమ్ నెం. 27, సెమినార్ హాల్), మరియు కనేకల్ (రూమ్ నెం. 30, 31) మండలాల లెక్కింపు కొనసాగనుంది.

గుంతకల్లు రెవెన్యూ డివిజన్

గుంతకల్లు రెవెన్యూ డివిజన్‌లో 9 మండలాల ప్రక్రియ కోసం 4 కేంద్రాలు ఏర్పాటు చేశారు. గుంతకల్లు ఎస్కేపి గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో గుత్తి, యాడికి, గుంతకల్లు, పెద్దవడుగూరు, మరియు పామిడి మండలాల కౌంటింగ్ జరగాల్సి ఉండగా, అందులో గుత్తి, గుంతకల్లు, పామిడి మండలాల స్థానాలు ఏకగ్రీవం కావడంతో అక్కడ కౌంటింగ్ ఉండదు. ఉరవకొండ ఎస్.కె గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో విడపనకల్లు మండలానికి, మరో గవర్నమెంట్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఉరవకొండ మరియు కూడేరు మండలాలకు, శ్రీకరిబసవన్న స్వామి హైస్కూల్‌లో వజ్రకరూరు మండలానికి సంబంధించి ఓట్ల లెక్కింపు చేపడతారు.

భద్రత మరియు ముందస్తు చర్యలు

లెక్కింపు ప్రక్రియ పక్షపాతం లేకుండా సాగేందుకు కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. గుర్తింపు కార్డులు కలిగిన ఎన్నికల ఏజెంట్లు, అధికారిక సిబ్బందికి మాత్రమే ప్రాంగణాల్లోకి ప్రవేశం ఉంటుంది. లెక్కింపు సమయం అంతటా నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, అత్యవసర వైద్య శిబిరాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు.

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు

శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ఆదేశం





కొత్తచెరువు (తెలుగు కలం) (నవంబర్ 06) : ప్రతినిధి : శ్రీ సత్యసాయి జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఏ. శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కొత్తచెరువులోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కౌంటింగ్ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ తరగతులకు జిల్లా కలెక్టర్ హాజరై, శిక్షణ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ సిబ్బందికి పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 7వ తేదీ శనివారం నిర్వహించనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో విధులు నిర్వహించే సిబ్బంది తమకు కేటాయించిన బాధ్యతలపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలు, నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత అప్రమత్తతతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. ?కౌంటింగ్ ప్రక్రియలో ప్రతి దశను నిర్దేశిత నిబంధనల ప్రకారమే చేపట్టాలని, ఓట్ల లెక్కింపులో పారదర్శకత, కచ్చితత్వం తూచా తప్పకుండా పాటించాలని కలెక్టర్ ఉద్ఘాటించారు. సిబ్బంది తమ విధులపట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, ఈ మొత్తం ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా ముగిసేలా సహకరించాలని ఆదేశించారు. ?అదేవిధంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపును విజయవంతంగా పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం మరియు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పరిపూర్ణ సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

ధర్మవరంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓట్ల లెక్కింపు సిబ్బందికి శిక్షణ

ఆర్డీవో రామ భూపాల్ రెడ్డి





ధర్మవరం(తెలుగు కలం) (నవంబర్ 06) : ప్రతినిధి : శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం పట్టణంలో ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి సిబ్బందికి ఆర్డీవో రామ భూపాల్ రెడ్డి, డిడిఓ శ్రీనివాసులు, ఎంపీడీవో వెంకటేశు ఆధ్వర్యంలో విస్తృత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల కేంద్రాలలో ఈ కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఇటీవల జరిగిన ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలను అత్యంత సజావుగా పూర్తి చేశామని, అదే తీరులో కౌంటింగ్ ప్రక్రియను కూడా పూర్తి సమన్వయంతో విజయవంతం చేయాలని అధికారులకు, కౌంటింగ్ సిబ్బందికి ఆర్డీవో సూచించారు. కౌంటింగ్ నిర్వహణ కోసం కేటాయించిన రెండు కేంద్రాలలో ప్రాంతాల వారీగా ఏర్పాట్లు పూర్తి చేశారు. ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోని రామగిరి, కనగానపల్లి, చెన్నె కొత్తపల్లి మండలాలకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియను ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో చేపట్టనుండగా, ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల కౌంటింగ్ ప్రక్రియను ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నారు. ప్రతి మండలానికి ఆరు టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేసి కౌంటింగ్ ప్రక్రియను ప్రారంభిస్తారు. ప్రస్తుతం మొత్తం 80 మంది కౌంటింగ్ సిబ్బంది ఈ విధుల్లో పాల్గొంటున్నారు. సిబ్బందికి కౌంటింగ్ విధానంపై ముందస్తుగా ప్రయోగాత్మక అవగాహన కూడా కల్పించారు. సున్నితమైన ఈ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు నలుగురు ఆర్వోల ఆధ్వర్యంలో పర్యవేక్షణ ఉండనుంది. ప్రతి రెండు గంటలకు ఒకసారి ఎన్నికల ఫలితాల వివరాలను అధికారికంగా వెల్లడించేలా చర్యలు చేపట్టారు. అన్ని మండలాలకు సంబంధించి కౌంటింగ్ సామగ్రిని ఇప్పటికే అందజేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో తాసిల్దార్ దేవరాజ్, ఎంఈఓ గోపాల్ నాయక్, మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్యలతో పాటు ఇతర రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్కేపీ కళాశాలలో ఐదు మండలాల ఓట్ల లెక్కింపుకు సర్వం సిద్ధం



యాడికి (తెలుగు కలం) (నవంబర్ 06) : జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గుంతకల్లు రెవెన్యూ డివిజన్ పరిధిలో నాలుగు కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, తొమ్మిది మండలాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. గుంతకల్లు పట్టణంలోని ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యాడికి, గుంతకల్లు, పెద్దవడుగూరు, పామిడి మండలాలకు సంబంధించిన ఓట్లనులెక్కించనున్నారు. కౌంటింగ్ ప్రక్రియ నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా నిర్వహించేం దుకు కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేస్తూ మూడం చెల పోలీసు భద్రత ఏర్పాటు చేశారు. గుర్తింపు కార్డులు కలిగిన ఎన్నికల ఏజెంట్లు, సిబ్బందికి మాత్రమే కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతి కల్పించనున్నారు. అదేవిదంగా నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, అత్యవసర వైద్య శిబిరాలు సిద్ధంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

అగాపే ఆశ్రమంలో అన్నదానం



యాడికి (తెలుగు కలం) (నవంబర్ 06) : యాడికి మండల కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే ఆశ్రమంలో వృద్ధులు, నిరాశ్రయులకు అనంతపురానికి చెందిన పాస్టర్ దారా జాన్ విల్సన్ కుటుంబ సభ్యులు అన్నదానం చేసినట్లు ఆశ్రమ ఫౌండర్ బత్తుల ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆశ్రమ ఫౌండర్ బత్తల ప్రసాద్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. వారి కుటుంబానికి దేవుని ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో భార్య విక్టోరియా, కుమారులు థామస్, అబ్రహాము, కోడలు అనిత, మనవరాళ్లు బ్లెస్సీ వినోలియా, కెవిన్ మోజెస్ పాల్గొన్నారు.

నగరూరులో డ్రై డే ఫ్రైడే తనిఖీలు



యాడికి (తెలుగు కలం) (నవంబర్ 06) : జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మనోజ్ ఆదేశాల మేరకు యాడికి మండల పరిధిలోని రాయలచెరువు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు దేవరాజన్,డాక్టర్ అప్పయ్య ఆధ్వర్యంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు నగరూరు సచివాలయ పరిధిలో డ్రై డే ఫ్రైడే తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు వ్యక్తిగత,పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించి, ప్రతి శుక్రవారం నీటి తొట్టెల ను శుభ్రం చేసి ఒక గంట ఆరబెట్టాలని సూచించారు.అనంత రం ఫీవర్ సర్వే నిర్వహించి,రాయలచె రువు పీహెచ్‌సీ ల్యాబ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం శివగంగ, మేల్ హెల్త్ అసిస్టెంట్ మైనుద్దీన్, ల్యాబ్ టెక్నీషియన్ సాయి లత తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం తీవ్ర అస్వస్థతతో అనంతపురం ఆస్పత్రికి తరలింపు



గుత్తి (తెలుగు కలం) (నవంబర్ 06) : ప్రతినిధి : అనంతపురం జిల్లా గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని ఉప్పర వీధిలో గురువారం ఒక విషాద సంఘటన చోటుచేసుకుంది. వీధికి చెందిన రమణయ్య అనే వ్యక్తి తన నివాసంలో ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఉరి వేసుకుంటున్న విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అప్రమత్తమై అతడిని రక్షించారు. అనంతరం అపస్మారక స్థితిలో ఉన్న రమణయ్యను కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం అందించిన వైద్యులు, బాధితుడి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం నిమిత్తం అనంతపురం సర్వజన ఆస్పత్రికి (జిజిహెచ్) రెఫర్ చేశారు. రమణయ్య ఆత్మహత్యాయత్నానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని స్థానికులు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న గుత్తి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

గుంతకల్లు మస్తాన్ పేటలో శానిటేషన్ పనుల తనిఖీ

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసుల విజ్ఞప్తి



గుంతకల్లు (తెలుగు కలం) (నవంబర్ 06) : ప్రతినిధి : అనంతపురం జిల్లా గుంతకల్లు మున్సిపాలిటీ పరిధిలోని 40వ వార్డు మస్తాన్ పేటలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ లక్ష్మీదేవి మరియు వార్డు కౌన్సిలర్ ప్రభాకర్ కలసి విస్తృతంగా పర్యటించి శానిటేషన్ (పారిశుధ్య) పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పరిసరా ప్రాంతాల్లో నెలకొన్న మురుగునీటి సమస్యలను పరిశీలించిన కమిషనర్ లక్ష్మీదేవి, డ్రైనేజీలో పేరుకుపోయిన ప్లాస్టిక్ మరియు పూడిక బ్లాకేజ్ లను వెంటనే తొలగించి నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత శానిటరీ సెక్రటరీని ఆదేశించారు. ?పర్యటన సమయంలో స్థానిక కాలనీవాసులు కమిషనర్ దృష్టికి తమ సమస్యలను తీసుకొచ్చారు. కొద్దిపాటి తేలికపాటి వర్షం కురిసినా మురుగునీరు రోడ్లపైకి చేరి ఇళ్లలోకి చొరబడుతోందని, దీనివల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఒక కల్వర్టు నిర్మించి తమ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యలపై సానుకూలంగా స్పందించిన కమిషనర్, అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పారిశుధ్య పరిశీలన అనంతరం కమిషనర్ లక్ష్మీదేవి స్థానిక అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రజలకు అందుతున్న భోజన నాణ్యత, పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు.

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

శనివారం 07 - 11 - 2026

ఎస్కేయూలో ఈ-వేస్ట్ తగ్గింపు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు



ఎస్కేయు/అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 06) : ప్రతినిధి : పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రిన్సిపల్ సోమశేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం విశ్వవిద్యాలయంలోని ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాల (ఈ-వేస్ట్) తగ్గింపు మరియు పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సోమశేఖర్ మాట్లాడుతూ.. నేటి ఆధునిక కాలంలో సాంకేతికత పెరుగుతున్న కొద్దీ ఎలక్ట్రానిక్ వ్యర్థాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాత గాడ్జెట్లు, మొబైల్స్, ల్యాప్‌టాప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ఇష్టానుసారంగా పారవేయడం వల్ల వెలువడే విషపూరిత రసాయనాలు నేలనూ, నీటినీ కలుషితం చేస్తున్నాయని హెచ్చరించారు. పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ఈ-వేస్ట్ నిర్వహణపై ప్రతి ఒక్కరిలోనూ అవగాహన ఉండాలని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అర్చన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే పర్యావరణంపై బాధ్యతాయుతమైన వైఖరిని అలవర్చుకోవాలని సూచించారు. ఎలక్ట్రానిక్ వస్తువులను అత్యవసరమైన మేరకే వాడటం, పాడైపోయిన పరికరాలను రీసైక్లింగ్ కేంద్రాలకు పంపడం ద్వారా ముప్పును తగ్గించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పర్యావరణ పరిరక్షణపై నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈ-వేస్ట్ నియంత్రణకు తాము కూడా నడుం బిగిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

ఆర్థిక అసమానతలు తగ్గించి సమతుల్య అభివృద్ధి సాధించాలి

ఎస్కేయూ వీసీ జ్యోతికుమార్



అనంతపురం(తెలుగు కలం) (నవంబర్ 06) : ప్రతినిధి : దేశంలో వివిధ రాష్ట్రాల మధ్య పెరుగుతున్న ఆర్థిక అసమానతలను తక్షణమే తగ్గించాలని, సమతుల్య ప్రాంతీయ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) ఉపకులపతి ప్రొఫెసర్ జ్యోతికుమార్ ఉద్ఘాటించారు. హైదరాబాద్‌లోని ప్రముఖ సెంట్రల్ యూనివర్సిటీ (యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్) వేదికగా నవంబర్ 6న నిర్వహించిన ఒక ప్రత్యేక జాతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలోని కొన్ని ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతుండగా, మరికొన్ని ప్రాంతాలు వెనుకబడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ రాష్ట్రాల మధ్య ఈ విధంగా ఆర్థిక అంతరాలు పెరగడానికి ప్రధాన కారణం మౌలిక సదుపాయాల (ఇన్ఫ్రాస్ట్రక్చర్) కల్పనలో ఉన్న ప్రాంతీయ తేడాలేనని ఆయన స్పష్టం చేశారు. విద్య, వైద్యం, రవాణా, పరిశ్రమల స్థాపన వంటి కీలక రంగాలలో అన్ని ప్రాంతాలకు సమానమైన వనరులు, అవకాశాలు కల్పించినప్పుడే నిజమైన వృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. ?ప్రాంతీయ అసమానతలు తొలగిపోతేనే దేశం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని, దీనికోసం ప్రభుత్వాలు, విధానకర్తలు, విద్యావేత్తలు సమష్టిగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ జాతీయ సదస్సులో దేశంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన విశిష్ట విద్యావేత్తలు, పరిశోధకులు, ఆర్థిక నిపుణులు పాల్గొని ప్రాంతీయ అసమానతల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై తమ అమూల్యమైన అభిప్రాయాలను పంచుకున్నారు.

వాసవి అమ్మవారి ఆలయంలో ధన త్రయోదశి ప్రత్యేక పూజలు





యాడికి నవంబర్ 06 (తెలుగు కలం) : యాడికి మండల కేంద్రంలో శుక్రవారం ధన త్రయోదశి సందర్భంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, షోడశోపచార పూజలు నిర్వహించగా, సాయంత్రం కుంకుమార్చన, కనకధారా స్తోత్రం, లలితా సహస్రనామ పారాయణం చేపట్టారు. పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో యాడికి ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం, యువజన సంఘం ప్రతినిధులు బంగారు బాల, పవన్, రాజేష్, శేఖర్, రాము, రంగా తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ఠ బందోబస్తు



అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 06) : ప్రతినిధి : అనంతపురం జిల్లావ్యాప్తంగా ఉత్కంఠభరితంగా సాగిన జడ్పీటీసీ మరియు ఎంపీటీసీ స్థానాల ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని కేవలం మూడు పోలింగ్ కేంద్రాలు మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లోనూ ఓటింగ్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తయినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ప్రజలు మరియు ఓటర్లు ఎంతో సంయమనంతో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే ఎన్నికల సిబ్బంది అప్రమత్తమయ్యారు. నిబంధనల ప్రకారం పోలింగ్ కేంద్రాల్లోని బ్యాలెట్ బాక్సులను అత్యంత భద్రతా నడుమ సేకరించి సీలు చేశారు. అనంతరం ఎంపిక చేసిన ప్రత్యేక రూట్ల ద్వారా ఆయా బ్యాలెట్ పెట్టెలను కట్టుదిట్టమైన పోలీసు భద్రత మధ్య అనంతపురంలోని జేఎన్టీయూ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములకు సురక్షితంగా తరలించారు. ఓటర్ల తీర్పును నిక్షిప్తం చేసిన బ్యాలెట్ బాక్సులను భద్రపరిచిన జేఎన్టీయూ స్ట్రాంగ్ రూముల వద్ద ఎలాంటి భద్రతా లోపాలు తలెత్తకుండా యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో స్ట్రాంగ్ రూముల చుట్టూ పటిష్ఠమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో సాయుధ పోలీసు బలగాలతో కూడిన రక్షణ వలయాన్ని ఏర్పాటు చేసి, స్ట్రాంగ్ రూముల వద్ద నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. కౌంటింగ్ జరిగే వరకు ఈ భద్రతా ఏర్పాట్లు కఠినంగా అమల్లో ఉంటాయని అధికారులు తెలిపారు.

అనంతపురం అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 06) : ప్రతినిధి : అనంతపురం నగర సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ సమష్టి కృషితో ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. నగర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించాలని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం నాడు నగరంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మేయర్ గా నూతనంగా ఎన్నికైన రమేశ్ గౌడ్, గెలుపొందిన కార్పొరేటర్లు అలాగే ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందిన అభ్యర్థులతో ఒక ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు ఎంతో నమ్మకంతో అందించిన విజయాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రతి నాయకుడిపై ఉందని హితవు పలికారు. కేవలం పదవులకే పరిమితం కాకుండా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారికి మరింత చేరువ కావాలని నూతనంగా ఎన్నికైన మేయర్ కు, కార్పొరేటర్లకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తను, అభ్యర్థిని గౌరవించుకుంటూ అందరం కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని కోరారు. అనంతపురం నగర ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, నగరంలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు.

సోమందేపల్లిలో నేడే పెనుకొండలో ఓట్ల లెక్కింపు



సోమందేపల్లి (తెలుగు కలం) (నవంబర్ 06) : ప్రతినిధి : శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి మండల పరిధిలో నిర్వహించిన ఎంపీటీసీ మరియు జడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో ముగిసినట్లు ఎన్నికల ప్రత్యేక అధికారి ఆదినారాయణ తెలిపారు. ఈ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియను శనివారం పెనుకొండలోని నిర్దేశిత కౌంటింగ్ కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలో నేడు జరగనున్న కౌంటింగ్ ప్రక్రియకు హాజరయ్యే అభ్యర్థులు మరియు వారి తరఫున పాల్గొనే కౌంటింగ్ ఏజెంట్లకు సంబంధించిన వివరాలను అధికారులు స్పష్టం చేశారు. కౌంటింగ్ ఏజెంట్ల పూర్తి వివరాలతో పాటు వారి రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలను శుక్రవారం సాయంత్రంలోపు సోమందేపల్లిలోని ఎంపీడీవో కార్యాలయంలో తప్పనిసరిగా సమర్పించాలని ఆయన హెచ్చరించారు. ఈ నిబంధనను పాటించి ఏజెంట్లు ఎటువంటి ఆలస్యం లేకుండా తమ వివరాలను అధికారులకు అందజేయాలని సూచించారు.

ఆసియా టెన్నిస్ బాల్ క్రికెట్

స్వర్ణ పతక విజేతను ఘనంగా సన్మానించిన ఎంపీ



అనంతపురం(తెలుగు కలం) (నవంబర్ 06) : ప్రతినిధి : అంతర్జాతీయ క్రీడా వేదికపై భారతదేశం తరఫున అద్భుత ప్రతిభను కనబరిచి, దేశానికి స్వర్ణ పతకాన్ని అందించడంతో పాటు అనంతపురం జిల్లా కీర్తిని ప్రపంచస్థాయిలో నిలబెట్టిన యువ క్రీడాకారిణి షేక్ షాహిద అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ఇటీవల ముగిసిన ఆసియా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ ఛాంపియన్‌షిప్‌లో భారత మహిళా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించిన ఆమె, తన అద్భుతమైన ఆటతీరుతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో అనంతపురం జిల్లాకు చెందిన షాహిద సాధించిన ఈ ఘన విజయంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. దేశం గర్వించదగ్గ రీతిలో రాణించిన షాహిదను అనంతపురం పార్లమెంటు సభ్యులు (ఎంపీ) అంబికా లక్ష్మీనారాయణ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సన్మాన కార్యక్రమంలో ఎంపీ ఆమెను ఘనంగా సత్కరించారు. క్రీడా రంగంలో మహిళలు రాణిస్తున్న తీరుకు షాహిద ఒక చక్కటి నిదర్శనమని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కొనియాడారు. అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించడం సాధారణ విషయం కాదని, ఎంతో పట్టుదల, కఠోర శ్రమ ఉంటేనే ఇది సాధ్యమవుతుందని అన్నారు. షాహిద అనంతపురం జిల్లా యువతకు, ముఖ్యంగా మహిళా క్రీడాకారిణులకు ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని మరిన్ని విజయాలను సాధించి, దేశానికి, రాష్ట్రానికి, జిల్లాకు మరింత పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ మరియు క్రీడా సంఘాల నుంచి క్రీడాకారులకు పూర్తి స్థాయి ప్రోత్సాహం ఉంటుందని ఈ సందర్భంగా ఎంపీ భరోసానిచ్చారు.

మడకశిరలో తప్పిన పెను ప్రమాదం..

ముళ్లపొదల్లోకి దూసుకెళ్లి కారు బోల్తా

మడకశిర (తెలుగు కలం) (నవంబర్ 06) : ప్రతినిధి : శ్రీసత్యసాయి జిల్లా మడకశిర పట్టణంలో రోడ్డు ప్రమాదం తృటిలో ఘోర నష్టం నుంచి తప్పింది. మడకశిర పట్టణం నుంచి కర్ణాటక రాష్ట్రంలోని పావగడకు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న టీడీ పల్లి క్రాస్ వద్ద గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు మరియు ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. మడకశిర వైపు నుంచి పావగడ వైపు వేగంగా వెళ్తున్న ఒక కారు, టీడీ పల్లి క్రాస్ సమీపానికి వచ్చేసరికి ఒక్కసారిగా అదుపుతప్పింది. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో వాహనం రోడ్డు పక్కనే ఉన్న దట్టమైన ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. కారు వేగంగా వెళ్లడంతో ఈ ప్రమాదంలో వాహనం ముందు భాగం దెబ్బతిన్నది. అయితే, ఈ ప్రమాద సమయంలో కారులో ప్రయాణిస్తున్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన వాసులకు ఎలాంటి ప్రాణాపాయం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కారు బోల్తా పడిన విషయాన్ని గమనించిన స్థానిక బాటసారులు మరియు అటుగా వెళ్తున్న వాహనదారులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా తక్షణమే స్పందించి, కారులో చిక్కుకున్న ప్రయాణికులను సురక్షితంగా బయటకు వెలికితీశారు. ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఓట్ల లెక్కింపునకు

పటిష్ఠ భద్రత ఎస్పీ సతీశ్ కుమార్



పుట్టపర్తి (తెలుగు కలం) (నవంబర్ 06) : ప్రతినిధి : శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా శనివారం జరగనున్న జెడ్పీటీసీ మరియు ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పోలీసులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ సతీశ్ కుమార్ ఒక ప్రకటనలో స్పష్టతనిచ్చారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠమైన పోలీసు భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. ఓట్ల లెక్కింపు జరిగే కేంద్రాల వద్ద ఎలాంటి అభద్రతా భావానికి తావులేకుండా మూడంచెల పోలీసు భద్రతను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. కౌంటింగ్ కేంద్రాలతో పాటు వాటి పరిసర ప్రాంతాలపై అత్యాధునిక డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతరం నిఘా ఉంచనున్నట్లు ఆయన హెచ్చరించారు. నిబంధనలను అతిక్రమించి శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు, వారి విజయోత్సవాల్లో పాల్గొనే మద్దతుదారులు ఎవరూ కూడా ఊరేగింపులు మరియు ర్యాలీలు నిర్వహించరాదని ఎస్పీ సతీశ్ కుమార్ స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనావళికి అనుగుణంగా విజేతలు సంయమనం పాటించాలని కోరారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద అభ్యర్థులు, వారి ఏజెంట్లు పోలీసుల సూచనలను పాటిస్తూ అధికారులకు సహకరించాలని జిల్లా ప్రజలను మరియు రాజకీయ పార్టీల ప్రతినిధులను ఆయన కోరారు.

నక్కనదొడ్డి సమస్యలను

వెంటనే పరిష్కరిస్తాం ఎమ్మెల్యే జయరాం



గుంతకల్లు (తెలుగు కలం) (నవంబర్ 06) : ప్రతినిధి :గుంతకల్లు నియోజకవర్గంలోని నక్కనదొడ్డి గ్రామానికి చెందిన పలువురు గ్రామస్థులు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న పలు సమస్యల గురించి వారు ఎమ్మెల్యేకి విన్నవించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ?గ్రామస్థులు తెలిపిన సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే జయరాం, గ్రామంలోని ప్రతి సమస్యనూ ప్రాధాన్యత క్రమంలో త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్చార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి కూడా పాల్గొన్నారు.

విడపనకల్లు మండలం డోనేకల్‌లో ప్రమాదం

విద్యుత్ షాక్‌తో తాపీ మేస్త్రీకి తీవ్ర గాయాలు



విడపనకల్లు (తెలుగు కలం) (నవంబర్ 06) : ప్రతినిధి : అనంతపురం జిల్లా విడపనకల్లు మండలం డోనేకల్ గ్రామంలో గురువారం ఒక ప్రమాదం చోటుచేసుకుంది. భవన నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో అనుకోని విధంగా జరిగిన ప్రమాదంలో ఒక తాపీ మేస్త్రీ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు మరియు బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రంలోని వీరాపురం గ్రామానికి చెందిన లోకేశ్ అనే యువకుడు ఉపాధి నిమిత్తం విడపనకల్లు మండలం డోనేకల్‌కు వచ్చి, తాపీ మేస్త్రీగా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం నాడు డోనేకల్ గ్రామంలోని ఒక భవన నిర్మాణ పనుల్లో లోకేశ్ నిమగ్నమై ఉన్నాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తూ అక్కడ ఉన్న హైటెన్షన్ విద్యుత్ తీగలు అతనికి తగలడంతో ఒక్కసారిగా భారీ విద్యుత్ షాక్ గురై తీవ్రంగా గాయపడి కిందపడిపోయాడు. ఈ ప్రమ్మాదాన్ని గమనించిన చుట్టుపక్కల స్థానికులు వెంటనే ధైర్యంగా స్పందించారు. క్షణాల వ్యవధిలోనే అప్రమత్తమై, బాధితుడిని ప్రాథమిక చికిత్స నిమిత్తం మరియు మెరుగైన వైద్యం అందించేందుకు తక్షణమే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో ఆయనకు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది. భవన నిర్మాణ పనుల సమయంలో విద్యుత్ తీగల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని స్థానికులు ఈ సందర్భంగా కోరుతున్నారు.

తెలుగుదేశం పార్టీలోకి గుంతకల్లు ఇండిపెండెంట్ కౌన్సిలర్లు





గుంతకల్లు (తెలుగు కలం) (నవంబర్ 06) : ప్రతినిధి : గుంతకల్లు మున్సిపాలిటీ పరిధిలో రాజకీయం మరింత వేడెక్కింది. ఇటీవల జరిగిన గుంతకల్లు మున్సిపాలిటీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసి విజయం సాధించిన 41వ వార్డు కౌన్సిలర్ కృష్ణ నాయక్, 43వ వార్డు కౌన్సిలర్ శరణ్యలు తెలుగుదేశం పార్టీ (టీడీపీ) తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్ సమక్షంలో వీరిద్దరూ అధికారికంగా పార్టీలో చేరారు. ?ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్ వారికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. పార్టీలోకి కొత్తగా వచ్చిన నాయకులకు సరైన గుర్తింపు, మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ?తెలుగుదేశం పార్టీలో చేరిన అనంతరం కౌన్సిలర్లు కృష్ణ నాయక్, శరణ్య మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీ నిరంతరం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, పార్టీ అభివృద్ధి విధానాలకు ఆకర్షితులమై ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో తమ తమ వార్డుల అభివృద్ధితో పాటు, గుంతకల్లు పట్టణంలో టీడీపీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ యశోద కూడా హాజరై నూతనంగా చేరిన కౌన్సిలర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో పలువురు వార్డు కౌన్సిలర్లు, టీడీపీ సీనియర్ నాయకులు, స్థానిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేశారు.

గుంతకల్ రైల్వే స్టేషన్‌లో

బాలల రక్షణపై ప్రత్యేక అవగాహన సదస్సు



గుంతకల్లు (తెలుగు కలం) (నవంబర్ 06) : ప్రతినిధి : రైల్వే స్టేషన్ ప్రాంగణాల్లో బాలల రక్షణ, వారి హక్కుల పరిరక్షణను ధ్యేయంగా ఉంచుకుని జిల్లా బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గుంతకల్ రైల్వే స్టేషన్‌లో విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులు, వ్యాపారులు, రైల్వే సిబ్బందికి పిల్లల భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా రైలు ప్రయాణాలు, స్టేషన్ పరిసరాల్లో తప్పిపోయిన పిల్లలు, అనాథలు, ఆశ్రయం లేక తిరిగే చిన్నారులను గుర్తించి వారికి తగిన పునరావాసం కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. అంతేకాకుండా సమాజంలో తీవ్ర సమస్యగా మారిన బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల అక్రమ రవాణా (చైల్డ్ ట్రాఫికింగ్) నివారణపై ప్రయాణికులకు సుదీర్ఘంగా వివరించారు. చిన్నారి కార్మికులను గుర్తించినట్లయితే తక్షణమే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఏదైనా ఆపదలో ఉన్న పిల్లలు లేదా అనాథలు కనిపించినా, బాలల హక్కులకు భంగం వాటిల్లినా వెంటనే ఉచిత అత్యవసర సహాయక నంబర్ 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ ను సంప్రదించాలని అధికారులు స్పష్టం చేశారు. ఈ నంబర్ ద్వారా పిల్లలకు తక్షణ సహాయం, రక్షణ లభిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి మంజునాథ్, ఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ దివాకర్ కుమార్ తో పాటు జిల్లా బాలల పరిరక్షణ సమితి ప్రతినిధులు, రైల్వే రక్షణ దళ అధికారులు, స్థానిక సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బాలల భద్రత అందరి సామాజిక బాధ్యత అని చాటిచెబుతూ ప్రయాణికులకు అవగాహన పత్రాలను పంపిణీ చేశారు.

బాల్య వివాహాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత

మండల విద్యాశాఖ అధికారి మస్తాన్ రావు



గుంతకల్లు (తెలుగు కలం) (నవంబర్ 06) : ప్రతినిధి : బాల్య వివాహాలను సమాజం నుంచి పూర్తిగా రూపుమాపేందుకు గ్రామస్థాయి నుంచి ప్రజలు, యువతీ యువకులు నడుం బిగించాలని మండల విద్యాశాఖ అధికారి మస్తాన్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం గుంతకల్లు లోని చైతన్య కాలేజీలో 'బాల్య వివాహ ముక్త భారత్' కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, బాల్య వివాహాల వల్ల విద్యార్థుల ఉజ్వల భవిత నాశనం కావడంతో పాటు వారి ఆరోగ్యాలపై తీవ్ర దుష్ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో చట్టాలు ఎంత ప్రత్యేకంగా ఉన్నప్పటికీ, ప్రజల్లో మార్పు రాకపోతే ఈ దురాచారాన్ని అడ్డుకోవడం సాధ్యం కాదని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరికీ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. జిల్లాను పూర్తిగా బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దే బృహత్తర బాధ్యత కేవలం ప్రభుత్వ శాఖలదే కాదని, సమాజంలోని ప్రతి ఒక్క పౌరుడిపై ఉందని ఆయన స్పష్టం చేశారు. యువతీ యువకులు చదువుపై దృష్టి కేంద్రీకృతం చేసి, తమ చుట్టుపక్కల బాల్య వివాహాలు జరిగితే వెంటనే అధికారులకు సమాచారం అందించి బాధ్యతాయుతమైన పౌరులుగా నిలవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

శనివారం 07 - 11 - 2026

పోలవరం ప్రాజెక్టు పూర్తికి గడువు పెంపు అధ్యయనానికి ఐదుగురితో కమిటీ



పోలవరం తొలిదశ కచ్చితంగా ఎప్పుడు పూర్తి అవుతుందో తేల్చి చెప్పేందుకే ఆ ప్రాజెక్టు అథారిటీ ఐదుగురు సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది.పోలవరం తొలిదశ కచ్చితంగా ఎప్పుడు పూర్తి అవుతుందో తేల్చి చెప్పేందుకే ఆ ప్రాజెక్టు అథారిటీ ఐదుగురు సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. వీలైనంత త్వరగా నివేదిక ఇవ్వాలని ఆ కమిటీని కోరింది. క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించి, డిజైన్ల ఆమోదం, ఏ విభాగంలో పని పరిమాణం ఎంతుంది2027 మార్చి నెల దాటి ఇంకా ఎంతకాలం సమయం పడుతుందిఅన్న అంశాలను కమిటీ అధ్యయనం చేయాల్సి ఉంటుంది.ఆ నివేదిక ఆధారంగా పోలవరం పనుల గడువు పెంచేలా కేంద్రజల్‌శక్తిశాఖ అనుమతి కోసం అథారిటీ లేఖ రాయాలి. ఆ అనుమతి ఉంటేనే 2027-28 ఆర్థిక సంవత్సరంలోనూ కేంద్రం ఇచ్చే నిధులు ఖర్చు చేసేందుకు వీలు ఉంటుంది. ఈ మేరకు పీపీఏ సీఈవో ఉత్తర్వులు ఇచ్చారు. ఈ కమిటీలో పీపీఏ సభ్య కార్యదర్శి, పోలవరం అథారిటీ చీఫ్ ఇంజినీరు (ప్లానింగు, డిజైన్), రాష్ట్ర జలవనరులశాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్, వ్యాప్కోస్ జనరల్ మేనేజర్, పునరావాస కమిషనర్‌లను సభ్యులుగా నియమించారు. కిందటి నెలలో కేంద్రజల్‌శక్తి కార్యదర్శి పోలవరంపై సమీక్షించిన సందర్భంలోనూ ఈ అంశం చర్చకు వచ్చింది.ఎందుకీ కమిటీ: పోలవరం ప్రాజెక్టు తొలిదశకు కేంద్రం రూ.30,436.95 కోట్లతో అంచనాలను 2024 జూన్ తర్వాత సవరించింది. ఈ ప్రాజెక్టులో +41.15 మీటర్ల ఎత్తులో నీరు నిలిపేందుకు వీలుగా ఈ నిధులు మంజూరు చేసింది. అప్పటి వరకు ఇచ్చిన నిధులు పోను రూ.12,157.53 కోట్లు ఇచ్చేందుకు, అదీ అడ్వాన్సుగా అందజేసేందుకు కేంద్రం అనుమతించింది. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేంద్రం తీసుకున్న కీలక నిర్ణయం ఇది.కేంద్ర మంత్రి మండలి ఈ నిధులు ఇచ్చేందుకు అనుమతిస్తూ ప్రాజెక్టు తొలిదశను 2026 మార్చి నాటికి పూర్తి చేయాలని గడువు విధించింది. ఒక వేళ ఆలస్యమైతే ఎట్టి పరిస్థితుల్లోనూ 2027 మార్చి నెలాఖరుకు పూర్తి చేయాలని షరతు విధించింది.2026 మార్చి ఆఖరుకు పూర్తయ్యే పరిస్థితులు లేకపోవడంతో 2027 మార్చి 31 నాటికి పూర్తి చేయాలంటూ ఈ ఏడాది మార్చిలో కేంద్ర జల్‌శక్తి అనుమతి ఇచ్చింది. ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టు ప్రధాన డ్యాం నిర్మాణం వేగంగా సాగుతున్నా 2027 మార్చి ఆఖరుకు ఎంత వరకు పూర్తవుతుందనేది కాస్త అనుమానమే. 2027 జూన్ నెలాఖరుకు కచ్చితంగా పూర్తి చేయగలమనే నమ్మకం అధికార యంత్రాంగంలో కనిపిస్తోంది. ఇందుకు కేంద్రం నుంచి గడువు పెంపు ఉత్తర్వులు అందుకోవాల్సి ఉంటుంది.2027 మార్చి 31 వరకే ఖర్చు చేసే అవకాశం : అంచనాల సవరణ కమిటీ ఆమోదం, అనుమతి మేరకు 2027 మార్చి 31 వరకే నిధులు ఖర్చు చేసేందుకు అవకాశం ఉంది. తదుపరి ఆర్థిక సంవత్సరంలోకి అంటే 2027-28లో పోలవరంపై ఖర్చు చేయాలంటే కేంద్రం నుంచి ముందుగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో తదుపరి ఆర్థిక సంవత్సరంలో పోలవరంపై రూ.981.12 కోట్లు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంటుందని అంచనా వేశారు. కేంద్రం నుంచి గడువు పెంపు అనుమతి కోసం లేఖ రాసే క్రమంలో పోలవరం అథారిటీ ఒక కమిటీని ఏర్పాటు చేసి అధ్యయనం చేయాలని భావించింది.ఈ కమిటీ పోలవరం ప్రాజెక్టు ప్రస్తుత నిర్మాణ, ఆర్థిక పురోగతిని మదింపు చేయాలి. ప్రధాన డ్యాం నిర్మాణానికి అవసరమైన ఆకృతుల అనుమతులు, పూర్తి చేసేందుకు ఉన్న సాధన సంపత్తి, రక్షణ పనులకు సంబంధించిన అంశాలు పరిశీలించాలి. 2027 మార్చి తర్వాత ఎంత కాలానికి పూర్తి చేయగలరుఅందుకు తగ్గ వనరులు ఉన్నాయా?లేదాఅన్న అంశమూ పరిశీలించాలి. అలాగే భూసేకరణ, పునరావాస కాలనీల నిర్మాణ వాస్తవ పరిస్థితులు పరిశీలించి, ఎప్పటికి పూర్తి అవుతాయో తేల్చాలి. చేయబోయే పనులన్నీ రూ.30,436.95 కోట్ల పరిధిలోనే ఉండాలి. పోలవరం పనుల గడువు పెంపు కోరుతూ కేంద్రజల్‌శక్తికి నివేదించేందుకు వీలుగా ఈ నివేదిక ఉండాలి.

భూగర్భ జలాలపై ఎల్ నినో ప్రభావం
అడుగంటుతున్న పాతాళ గంగను పెంచే మార్గాలివే!



తెలంగాణ రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. నిత్య జీవితంలో అనవసరంగా వృథా చేస్తున్న నీటిని గుర్తించి, ఇంకుడు గుంతల ద్వారా భూగర్భంలోకి పంపిం చాలి.ఎల్‌నినో ప్రభావం వల్ల, భూగర్భ జలాలు రోజురోజుకీ అడుగంటిపోతున్నాయి. కొన్ని చోట్ల, బోర్ల నుంచి నీటిని పొందడంలో ఇళ్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నీటి వినియోగంలో నిర్లక్ష్యం కారణంగా ప్రతిరోజూ వందలాది లీటర్ల నీరు వృథా అవుతోంది. ఇటువంటి విపత్కర పరిస్థితులలో మనం కొంచెం ఆలోచించి ముందుకు సాగితే నీటి వృథాను నివారించే అవకాశం ఉంది. ఇళ్లలో నీటిని ఆదా చేయడానికి నిపుణులు కొన్ని నియమాలను పాటించాలని సూచిస్తున్నారు.

ఆర్వో ప్లాంట్ వృథాను ఆపాలి

చాలా ఇళ్లలో ఆర్వో ప్లాంట్ల నుంచి వచ్చే నీటిని తాగడం అలవాటుగా మారింది. ఒక లీటరు తాగునీటిని అందించడానికి, యంత్రం 3 లీటర్ల నీటిని పంప్ చేస్తుంది. దీనివల్ల తాగడానికి ఉపయోగపడే దానికంటే ఎక్కువ నీరు వృథా అవుతుంది.సూచన: వ్యర్థ నీటిని ఒక బకెట్‌లో సేకరించాలి. దానిని బట్టలు ఉతకడానికి, ఇల్లు తుడుచుకోవడానికి ఉపయోగించాలి. దీనివల్ల నెలకు వేల లీటర్ల నీరు ఆదా అవుతుంది.

ఇంకుడు గుంత తప్పనిసరి

వర్షం పడినప్పుడు, ఆ నీటిని సింక్‌లోకి మళ్లించాలి. దీనివల్ల వేసవిలో బోరుబావులు అడుగంటిపోకుండా ఉంటాయి. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత తప్పనిసరి చేస్తే చాలా బాగుంటుంది.

కుళాయి కింద కడగవద్దు

చాలామంది వంటగదిలో కుళాయి కింద కూరగాయలు కడుగుతారు. అలా చేయడం వల్ల ప్రతిసారీ 15-20 లీటర్ల నీరు వృథా అవుతుంది. పళ్లు తోముకునేటప్పుడు లేదా గడ్డం చేసుకునేటప్పుడు కుళాయిని తెరిచి ఉంచవద్దు. దాన్ని మూసివేస్తే, రోజుకు 15 లీటర్ల నీటిని ఆదా చేసినవారవుతారు.

సూచన : ఒక బేసిన్‌లో నీళ్లు తీసుకుని అందులోనే స్నానం చేయాలి. బియ్యం కడిగిన నీటిని పారవేయకుండా మొక్కలకు ఉపయోగించాలి.

షవర్ వద్దు బకెట్ వాడటమే మేలు

చాలా ఇళ్లలో 50 శాతం నీరు బాత్రూంలలోనే వృథా అవుతుంది. షవర్ చేయడానికి 5 నుంచి 10 నిమిషాలు పడుతుంది. దీనికి సుమారు 100 లీటర్ల నీరు అవసరం.

సూచన : బకెట్‌తో స్నానం చేసే అలవాటు చేసుకోవాలి. షవర్‌కు బదులుగా మగ్గును ఉపయోగించాలి.

ఆలోచించి ఫ్లష్ చేయాలి

టాయిలెట్లలో ఒక్కసారి ఫ్లష్ చేస్తే 30 లీటర్ల వరకు నీరు వృథా అవుతుంది. అదే పాత మోడల్ ఫ్లష్ అయితే 12-15 లీటర్ల నీటిని వాడుతుంది.

సూచన : ఫ్లష్ ట్యాంక్‌లో ఇసుక లేదా నీటితో నింపిన ఒక లీటరు వాటర్ బాటిల్‌ను ఉంచాలి. దీనివల్ల ప్రతిసారి ఒక లీటరు నీరు ఆదా అవుతుంది. తక్కువ, ఎక్కువ నీటిని విడుదల చేయడానికి డ్యూయల్ బటన్‌ను ఉపయోగించాలి.

దుస్తులు ఎలా ఉతుకుతున్నారు

చాలా మంది కొన్ని బట్టలను వాషింగ్ మెషీన్‌లో వేస్తారు. ఒక్కసారి ఆన్ చేస్తే మెషీన్ ద్వారా 60 లీటర్ల నీరు వృథా అవుతుంది.

సూచన : డ్రమ్ పూర్తిగా దుస్తులతో నిండిన తర్వాతే వాషింగ్ మెషీన్‌ను ఆన్ చేయాలి. చేతితో ఉతకడం అలవాటు చేసుకుంటే మరింత నీటిని ఆదా చేయవచ్చు. మెషీన్ నుంచి వచ్చే నీటిని టాయిలెట్లను కడగడానికి ఉపయోగించాలి.

వాకిలి, వాహనాలు కడగడానికి

వాకిలిని పైపుతో కడిగినట్లయితే 100 లీటర్ల వరకు నీరు వృథా అవుతుంది. కారు లేదా ద్విచక్ర వాహనాన్ని కడగడం వల్ల 150 లీటర్ల నీరు వృథా అవుతుంది.

సూచన : పైపు బదులు చీపురుతో ఊడ్చాలి. కారును బకెట్ నీటితో కడగాలి. బైక్‌ను తడి గుడ్డతో తుడవాలి.

లీక్‌లు ఉన్నాయేమో చూసుకోవాలి

ఇంట్లో కుళాయి నుంచి నీరు కారుతూ ఉంటే తెలియకుండానే నెలకు 1000 లీటర్ల నీరు వృథా అవుతుంది. ఎక్కువ కుళాయిలు ఉన్న ప్రదేశాలలో ఇది ఇంకా ఎక్కువగా ఉంటుంది. ఆ కుళాయిని లేదా వాకర్‌ను వెంటనే మార్చాలి.

బోర్లపై దృష్టి సారించాలి

ఇళ్లలోని ట్యాంకులు బోర్ల ద్వారా నిండి వృథా అవుతున్నాయి. ప్రతి ఇంట్లో రోజుకు రెండు, మూడు సార్లు కుళాయిని తిప్పడంలో 10 నిమిషాల ఆలస్యం జరిగినా, వేలాది లీటర్ల నీరు నేలపైకి పొంగిపొర్లుతోంది.

సూచన : బోరు వేసి మర్చిపోకుండా అలారం పెట్టుకొని ఆఫ్ చేసుకోవాలి. లేకపోతే ఆధునిక సాంకేతికతతో పనిచేసే ఆటోమేటిక్ యంత్రాలను ఏర్పాటు చేసి ట్యాంక్ నిండిన వెంటనే బోర్‌ను ఆపివేసేలా ఏర్పాటు చేసుకోవాలి.ఎల్‌నినో ప్రభావం వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజల జీవనశైలిలో మార్పు రావాలి. చాలామంది నల్లా ద్వారానే రకరకాల పనులు చేసుకోవడానికి అలవాటు పడ్డారు. దీనివల్ల చాలా నీరు వృథా అవుతోంది. వారు బకెట్‌లో నీటిని పట్టుకుని ఏ పనికైనా వాడుకోవాలి. నీరు లీక్ కాకుండా ప్రతి ఇంటికి మరమ్మతులు చేయాలి. అనేక చోట్ల మిషన్ భగీరథ నీరు వృథా అవుతోంది. అవసరమైనంత మాత్రమే వాడుకునేలా కుళాయిలు ఏర్పాటు చేయాలి. మిగిలిన నీరు వృథా కాకుండా చూడాలి. మిషన్ భగీరథ అధికారుల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తాం - సంపత్ కుమార్, మిషన్ భగీరథ ఈఈ, మెదక్ జిల్లా.

హైదరాబాదీలకు దీపావళి కానుక

భారీగా తగ్గిన మెట్రో-ఆర్టీసీ కామన్ పాస్ ధరలు

నెలవారీ కామన్ పాస్ ధర రూ.8,500 నుంచి రూ.4,000కి తగ్గింపు

రోజువారీ పాస్ ధరను రూ.400 నుంచి రూ.275కి తగ్గించిన సర్కార్

దీపావళి కానుక ఈ నెల 8 నుంచి అమలులోకి రానున్న కొత్త ధరలు



హైదరాబాద్ నగరవాసులకు తెలంగాణ ప్రభుత్వం దీపావళి కానుక ప్రకటించింది. మెట్రో రైలు, టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు ఉద్దేశించిన కామన్ పాస్ ధరలను భారీగా తగ్గిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త ధరలు నవంబర్ 8 నుంచి అమలులోకి రానున్నాయి.తాజా నిర్ణయంతో గతంలో రూ. 8,500గా ఉన్న నెలవారీ కామన్ పాస్ ధర ఇప్పుడు రూ. 4,000కి తగ్గింది. ఇందులో రూ. 3,000 మెట్రోకు, రూ. 1,000 టీజీఎస్ఆర్టీసీకి కేటాయించారు. ఈ పాస్‌తో నెలలో 50 రౌండ్ ట్రిప్పులు చేసేందుకు అవకాశం ఉంటుంది. అదేవిధంగా రూ. 400గా ఉన్న రోజువారీ పాస్ ధరను రూ. 275కి తగ్గించారు. ఇందులో రూ. 200 మెట్రోకు, రూ. 75 ఆర్టీసీకి చెల్లించాల్సి ఉంటుంది. ఈ పాస్‌పై రోజుకు నాలుగు సింగిల్ జర్నీలకు అనుమతి ఉంటుంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ ధరలను సవరించినట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నిత్య ప్రయాణికులపై ఆర్థిక భారాన్ని తగ్గించడంతో పాటు ప్రజలు ఎక్కువగా ప్రజా రవాణాను వినియోగించేలా ప్రోత్సహించడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు.కాగా, మెట్రో, ఆర్టీసీ ప్రయాణాల కోసం ఒకే కార్డును వినియోగించే ఈ కామన్ పాస్‌ను అక్టోబర్ ప్రారంభంలో ప్రవేశపెట్టారు. అయితే, అప్పట్లో నిర్ణయించిన ధరలు చాలా ఎక్కువగా ఉన్నాయని ప్రయాణికుల నుంచి విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ధరలను తగ్గిస్తూ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

గంటల వ్యవధిలో రెండు ప్రమాదాలు.. తృటిలో బయటపడ్డ ఎమ్మెల్యే వీరేశం



తెలంగాణ ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఒకే రోజు గంటల వ్యవధిలో రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల నుంచి తృటిలో సురక్షితంగా బయటపడ్డారు. నల్గొండ జిల్లాలో గురువారం ఈ సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ప్రమాదాల్లో ఆయన ప్రయాణిస్తున్న రెండు కార్లు పాక్షికంగా దెబ్బతిన్నప్పటికీ, ఆయనకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో కాంగ్రెస్ శ్రేణులు, ఆయన అనుచరులు ఊపిరి పీల్చుకున్నారు.వివరాల్లోకి వెళితే.. ఎమ్మెల్యే వీరేశం గురువారం నకిరేకల్ నుంచి చిట్యాల మండలం చినకాపర్తికి తన ఫార్చ్యూనర్ వాహనంలో బయలుదేరారు. కట్టంగూరు మండలం చెర్వు అన్నారం స్టేజీ వద్ద జాతీయ రహదారిపై వెళుతుండగా, వెనుక నుంచి వేగంగా వచ్చిన ఒక కార్నివాల్ కారు ఆయన వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ తాకిడికి ఎమ్మెల్యే కారు ముందు వెళుతున్న ఎస్కార్ట్ వాహనాన్ని ఢీకొంది. ప్రమాద తీవ్రతకు కారు పాక్షికంగా దెబ్బతిన్నప్పటికీ, ఎయిర్‌బ్యాగ్‌లు వెంటనే తెరుచుకోవడంతో వీరేశం సురక్షితంగా బయటపడ్డారు.ఈ ఘటన జరిగిన వెంటనే భద్రతా సిబ్బంది అప్రమత్తమై, ఎమ్మెల్యేను మరో ఇన్నోవా క్రిస్టా కారులోకి మార్చి గమ్యస్థానానికి పంపించారు. అయితే, కొద్దిసేపటికే ఆ ప్రత్యామ్నాయ వాహనం కూడా ప్రమాదానికి గురైంది. చిట్యాల నుంచి తుంగతుర్తి వైపు వెళుతుండగా, ఒక లారీ వీరి కారును ఢీకొట్టింది. అదృష్టవశాత్తూ, ఈ రెండో ప్రమాదం నుంచి కూడా వీరేశం ఎలాంటి అపాయం లేకుండా బయటపడ్డారు.వరుస ప్రమాదాల తర్వాత కూడా ఎమ్మెల్యే వీరేశం తన పర్యటనను కొనసాగిస్తూ జనగామకు వెళ్లారు. ఒకే రోజు రెండుసార్లు ప్రమాద గండం నుంచి తమ నేత క్షేమంగా బయటపడటంతో కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు.

పరిషత్ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడిన వారిని ఉపేక్షించం: డీజీపీ హరీష్ కుమార్ గుప్తా



జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా వెల్లడించారు. పరిషత్ ఎన్నికల సందర్భంగా 15 జిల్లాల పరిధిలో 37 ఘటనలు జరిగినట్లు చెప్పారు.రాష్ట్రవ్యాప్తంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ అక్కడక్కడ జరిగిన కొన్ని స్వల్ప ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసినట్లు డీజీపీ హరీష్ కుమార్ గుప్తా వెల్లడించారు. బ్యాలెట్ బాక్సులు ఉంచే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ఠ భద్రత ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల విధుల్లో అంకితభావంతో పని చేసిన సిబ్బందికి అభినందనలు తెలిపారు.పోలింగ్ సందర్భంగా శాంతిభద్రతలకు ఆటంకం కలిగించినా, అక్రమాలకు పాల్పడినా ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, నిందితులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పోలింగ్ సరళిని, భద్రతా ఏర్పాట్లను డీజీపీ నిరంతరం పర్యవేక్షించారు. క్షేత్రస్థాయి అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డీజీపీ ఎన్నికల భద్రతకు సంబంధించిన కీలక వివరాలను వెల్లడించారు.40 వేల మందితో బందోబస్తు: రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లాల పరిధిలోని 582 జడ్పీటీసీ, 7,767 ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్ జరిగింది. ఇందుకోసం ఏర్పాటు చేసిన 31,460 పోలింగ్ కేంద్రాల వద్ద రికార్డు స్థాయిలో 40,679 మంది సిబ్బందితో విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు డీజీపీ హరీష్ కుమార్ గుప్తా వెల్లడించారు.15 జిల్లాల్లో 37 ఘటనలు: పరిషత్ ఎన్నికల సందర్భంగా కడప, అనంతపురం, కర్నూలు తదితర 15 జిల్లాల పరిధిలో 37 ఘటనలు చోటుచేసుకున్నట్లు పోలీసుశాఖ దృష్టికి వచ్చిందని డీజీపీ తెలిపారు. వాస్తవ పరిస్థితుల ఆధారంగా పోలింగ్, శాంతిభద్రతలకు ఆటంకం కలిగించిన వారిపై చట్టప్రకారం చర్యలు ఉంటాయన్నారు. పరిషత్ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడిన వారిని ఉపేక్షించబోమన్నారు.ఆధునిక సాంకేతికతతో నిఘా: సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలను ముందుగా గుర్తించి అదనపు బలగాలను రంగంలోకి దించారు. పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు సీసీటీవీ కెమెరాలు, బాడీ ఓన్ కెమెరాలతో పాటు 'సమర్థ్ యాప్', 'ట్రేస్ అప్లికేషన్' వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించామన్నారు.స్ట్రాంగ్ రూమ్‌లకు బ్యాలెట్ బాక్సులు: పోలింగ్ పూర్తయిన అనంతరం పోలింగ్ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సులను అత్యంత పటిష్టమైన పోలీసు బందోబస్తు నడుమ స్ట్రాంగ్ రూమ్‌లకు సురక్షితంగా తరలించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీజీపీ స్పష్టం చేశారు.

డీఎస్సీలో కనీస అర్హత మార్కుల నిబంధన
క్రీడా కోటాలో దరఖాస్తుకు ముందు శాప్‌లో రిజిస్ట్రేషన్ తప్పనిసరి



రాష్ట్రంలో ఉపాధ్యాయ నియామకాలకు నిర్వహిస్తున్న డీఎస్సీ-2026లో పాఠశాల విద్యాశాఖ పలు మార్పులు చేసింది. కనీస అర్హత మార్కుల నిబంధనను తెచ్చింది.రాష్ట్రంలో ఉపాధ్యాయ నియామకాలకు నిర్వహిస్తున్న డీఎస్సీ-2026లో పాఠశాల విద్యాశాఖ పలు మార్పులు చేసింది. కనీస అర్హత మార్కుల నిబంధనను తెచ్చింది. క్రీడా కోటా అభ్యర్థులు సైతం డీఎస్సీ రాయడంతో పాటు కనీస మార్కులు సాధించాలని నిర్దేశించింది. కొత్త నిబంధనల ప్రకారం ఓసీ అభ్యర్థులు 40శాతం కనీస అర్హత మార్కులు సాధించాలి.రాష్ట్రపతి ఉత్తర్వులు-2025 ప్రకారం 95శాతం డీఎస్సీ పోస్టులు స్థానిక అభ్యర్థులకు, మిగిలిన 5శాతం ఓపెన్ కాంపిటీషన్ కింద ఉంటాయి. ఈ 5శాతం పోస్టులను స్థానిక, స్థానికేతర అభ్యర్థులకు మెరిట్ ఆధారంగా ఇస్తారు. స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ, టీజీటీ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియలో కంప్యూటర్ ఆధారిత రాతపరీక్షకు 80 మార్కులు, టెట్‌కు 20 మార్కుల వెయిటేజీ ఉంటుంది. ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్, ప్రిన్సిపల్, పీజీటీ, పీడీ, పీఈటీ పోస్టులకు 100 మార్కులకు రాతపరీక్ష ఉంటుంది. వీటికి టెట్ అర్హత అవసరం లేదు. లాంగ్వేజ్ స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు 2017 నుంచి నిర్వహించిన సంబంధిత భాషా ప్రత్యేక టెట్ మార్కులనే పరిగణనలోకి తీసుకుంటారు. అంతకుముందు నిర్వహించిన ఉమ్మడి టెట్ మార్కులను పరిగణించరు.కనీస మార్కుల నిబంధన : కొత్త నిబంధనల ప్రకారం ఓసీ అభ్యర్థులు 40 శాతం కనీస అర్హత మార్కులు సాధించాలి. ఎస్ఏ, ఎస్జీటీ, టీజీటీ, ప్రత్యేక విద్య పోస్టులకు రాతపరీక్ష , టెట్ వెయిటేజీ కలిపిన తర్వాత ఓసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీ వారికి 40 శాతం, బీసీలకు 35 శాతం, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 30శాతం కనీస మార్కులు రావాలి. ఇంతకంటే తక్కువొస్తే అనర్హులు. పోస్టులు మిగిలిపోయినా అర్హత సాధించని వారికి అవకాశమివ్వరు. క్రీడా కోటాలోనూ కనీస మార్కులు సాధించిన వారే అర్హులవుతారు. స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్, ప్రిన్సిపల్, పీజీటీ, పీడీ, పీఈటీ పోస్టులకు రాతపరీక్ష మార్కుల్లో కనీస అర్హత తప్పనిసరి. ఈ కేటగిరీలోనూ క్రీడాకోటా అభ్యర్థులకు కనీస మార్కుల నిబంధన వర్తిస్తుంది.ఐఈఆర్‌టీ, ఐఈడీఎస్ఎస్, టీటీడీ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, కేజీబీవీ పాఠశాలల్లో ప్రత్యేక ఉపాధ్యాయులుగా పనిచేసిన వారికి సర్వీసు ఆధారంగా వెయిటేజీ ఇస్తారు. ఒక్కో ఏడాది సర్వీసుకు 0.5 మార్కుల చొప్పున గరిష్ఠంగా ఐదు మార్కులు కేటాయిస్తారు. ఏడాదిలో ఆరు నెలలకు మించి పనిచేస్తే ఒక ఏడాదిగా పరిగణిస్తారు. ఈ వెయిటేజీ కలిపినా మొత్తం మార్కులు 100 దాటకుండా చూస్తారు. డీఎస్సీలో కనీస అర్హత మార్కులు సాధించిన వారికే ఈ వెయిటేజీ వర్తిస్తుంది. అభ్యర్థులు తమ అర్హతలను బట్టి ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు సమయంలోనే పోస్టులు, యాజమాన్యాల వారీగా ప్రాధాన్య క్రమాన్ని తప్పనిసరిగా పేర్కొనాలి. ఆ తర్వాత ప్రాధాన్య ఐచ్ఛికాలను మార్చుకోవడానికి మెరిట్ జాబితా ప్రకటించాక వారం రోజుల గడువిస్తారు. గత డీఎస్సీలో దరఖాస్తు సమయంలోనే పోస్టుల ప్రాధాన్య ఐచ్ఛికాల నమోదుకు అవకాశమిచ్చారు. ఆ తర్వాత ఎడిట్ ఆప్షన్ లేక కొందరు అభ్యర్థులు ఉన్నత పోస్టులకు ఎంపికైనా ప్రాధాన్య ఐచ్ఛికం ఇవ్వనందున అవకాశాన్ని కోల్పోయారు. దీనిపై అప్పట్లో ఫిర్యాదులు వచ్చినందున ఈసారి మార్పు చేశారు.17 వేల మంది రిజిస్ట్రేషన్ : క్రీడల కోటాలో దరఖాస్తు చేసేవారు ముందుగా ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ క్రీడా యాప్ లేదా పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అక్కడ ఇచ్చే రిజిస్ట్రేషన్ గుర్తింపు నంబరును డీఎస్సీ దరఖాస్తులో నమోదు చేయాలి. యాప్‌లో నమోదుచేసిన క్రీడా సర్టిఫికెట్లలో ఏవైనా మూడు అత్యున్న తమైనవి దరఖాస్తు సమయంలో ఎంచుకోవాలి. యాప్‌లో అప్‌లోడ్ చేసిన అన్ని సర్టిఫికెట్లను జెన్యూనిటీ కోసం ఆయా సంఘాలు, సమాఖ్యలకు ఆన్‌లైన్‌లో పంపిస్తారు. ఇప్పటి వరకు క్రీడా కోటాలో 17 వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. రాతపరీక్షకు హాజరై కనీస అర్హత మార్కులు సాధించడంతో పాటు క్రీడా ప్రాధాన్య క్రమంలోనూ అర్హత ఉండాలి. క్రీడా కోటాలో ఎంపిక కాకపోతే సాధారణ మెరిట్ ప్రకారం పరిగణనలోకి తీసుకుంటారు.ప్రతి నియామక యూనిట్, పోస్టు, యాజమాన్యం వారీగా మెరిట్ కమ్ రోస్టర్ జాబితాను రూపొందిస్తారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన, జేసీ వైస్‌చైర్మన్‌గా ఉండే జిల్లా ఎంపిక కమిటీకి డీఈవో కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. మెరిట్ జాబితా విడుదలైన ఏడు రోజుల్లో అభ్యర్థులు అవసరమైన ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. పరిశీలన దశలో అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలను చూపించాలి. లేదంటే అభ్యర్థిత్వం రద్దవుతుంది. నియామకాల్లో వెయిటింగ్ జాబితా ఉండదు. తుది ఎంపిక జాబితా విడుదలయ్యాక అర్హులెవరూ లేకపోవడం, ఎంపికైన వారు విధుల్లో చేరకపోవడం వంటి కారణా లతో మిగిలిపోయే ఖాళీలను తదుపరి నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తారు. ఎంపికైన వారిని రెగ్యులర్ ప్రాతిపదికన నియమిస్తారు. అప్రెం టిస్ విధానం ఉండదు. నియామక ఉత్తర్వులు అందుకున్న 30 రోజుల్లో విధుల్లో చేరకపోతే ఉద్యోగం కోల్పోతారు. అన్ని పోస్టు లకు గరిష్ఠ వయోపరిమితి 2026 జులై 1 నాటికి 44 ఏళ్లు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 49 ఏళ్లు. దివ్యాంగులకు 54 ఏళ్లు. మాజీ సైనికులకు సైన్యంలో పనిచేసిన కాలానికి అదనంగా మూడేళ్ల మినహాయింపునిస్తారు.

బోస్టన్‌లో నల్గొండ యువతి అదృశ్యం... కొనసాగుతున్న గాలింపు

నాలుగు రోజులుగా లభించని శ్రీజ కోయ ఆచూకీ

శ్రీజ కోసం ముమ్మరంగా గాలిస్తున్న బోస్టన్ పోలీసులు

మానసిక ఆందోళనలో ఉండవచ్చని యూనివర్సిటీ వెల్లడి

సమాచారం ఉంటే తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి



అమెరికాలోని బోస్టన్‌లో ఉన్నత చదువుల కోసం వెళ్లిన నల్గొండ జిల్లా యువతి శ్రీజ కోయ (23) అదృశ్యమైన ఘటన తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. నవంబర్ 2వ తేదీ రాత్రి నుంచి ఆమె కనిపించకుండా పోగా, నాలుగు రోజులు గడిచినా ఆచూకీ లభ్యం కాలేదు. శ్రీజ కోసం బోస్టన్ పోలీసులు గాలింపు చర్యలను ముమ్మరం చేసి, ప్రజల సహాయం కోరుతున్నారు.పోలీసుల కథనం ప్రకారం, శ్రీజ నవంబర్ 2వ తేదీ రాత్రి సుమారు 9:45 గంటలకు డార్చెస్టర్‌లోని తన నివాసం నుంచి బయటకు వెళ్లారు. అప్పటి నుంచి ఆమె తిరిగి రాలేదు. ఆమె నల్ల జాకెట్, బ్లూ జీన్స్ ధరించినట్లు గుర్తించారు. శ్రీజ కార్సన్

మీరు చిరంజీవిలా బంగీ జంపింగ్ చేయాలనుకుంటున్నారా.. మన దేశంలో బెస్ట్ ప్లేసెస్ ఇవే..



రోటీన్ లైఫ్ బోర్ కొడుతోంది.. డిఫరెంట్ గా జీవితంలో కొంత సమయం అయినా గడపాలని కోరుకుంటున్నారా... ఉత్తేజకరమైన సంఘటనలను అనుభవించాలనుకుంటే.. భారతదేశంలో మీకు అనువైన ప్రదేశాలు చాలా ఉన్నాయి. ముఖ్యంగా దైర్యసాహస కార్యక్రమాలను ఇష్టపడేవారు బంగీ జంపింగ్ చేయాలనీ భావిస్తారు. అటువంటి వారు మన దేశంలో ఈ ప్రదేశాలను తప్పక సందర్శించాలి. ఇవి మీ ప్రయాణ ఆనందాన్ని రెట్టింపు చేస్తాయి. అందరికీ కొత్త ప్రదేశాలకు వెళ్ళడానికి.. ప్రయాణం చేయడం అంటే ఇష్టమే. మీకు నచ్చిన ప్రదేశాలకు వెళ్ళడం వలన మీలోని ఒత్తిడిని, అలసటను తగ్గిస్తుంది. ప్రతి సంవత్సరం ప్రజలు వేసవి సెలవుల్లో కొత్త ప్రదేశాలకు ప్రయాణించాలని ప్లాన్ చేసుకుంటారు. కనుక మీరు కూడా ఈ సెలవులను చిరస్మరణీయంగా మార్చుకోవాలనుకుంటే.. భారతదేశంలో సాహసాలు చేసేందుకు అనువైన కొన్ని ప్రదేశాలను సందర్శించవచ్చు. అక్కడ మీ మనసును రిఫ్రెష్ చేయడమే కాకుండా..వాటిని గుర్తుచేసుకున్నప్పుడు మీ ముఖంలో చిరునవ్వు తెచ్చే అందమైన అనుభవాన్ని కూడా పొందుతారు.

1 / 7

భారతదేశంలో అనేక రకాల సాహస కార్యకలాపాలు నిర్వహించడానికి అనువైన ప్రదేశాలున్నాయి. పారాగ్లైడింగ్, రాఫ్టింగ్, బంగీ జంపింగ్, స్కూబా డైవింగ్ వంటి సరదా కార్యకలాపాలు నిర్వహించబడతాయి. ఈరోజు మనం భారతదేశంలో బంగీ జంపింగ్ కోసం ఏ ప్రదేశాలను అన్వేషించవచ్చో తెలుసుకుందాం. భారతదేశంలోని ఈ 5 ప్రదేశాలు బంగీ జంపింగ్ కు ఉత్తమమైనవి. భారతదేశంలోనే ఎత్తైన బంగీ జంపింగ్ రిషికేశ్‌లో ఉంది. భారతదేశంలో అనేక రకాల సాహస కార్యకలాపాలు నిర్వహించడానికి అనువైన ప్రదేశాలున్నాయి. పారాగ్లైడింగ్, రాఫ్టింగ్, బంగీ జంపింగ్, స్కూబా డైవింగ్ వంటి సరదా కార్యకలాపాలు నిర్వహించబడతాయి. ఈరోజు మనం భారతదేశంలో బంగీ జంపింగ్ కోసం ఏ ప్రదేశాలను అన్వేషించవచ్చో తెలుసుకుందాం. భారతదేశంలోని ఈ 5 ప్రదేశాలు బంగీ జంపింగ్ కు ఉత్తమమైనవి. భారతదేశంలోనే ఎత్తైన బంగీ జంపింగ్ రిషికేశ్‌లో ఉంది.

2 / 7

రిషికేశ్ ప్రశాంతమైన వాతావరణానికి ప్రసిద్ధి చెందడమే కాదు మీరు ఇక్కడ అనేక రకాల సాహస కార్యకలాపాలను కూడా చేయవచ్చు. అత్యంత ప్రత్యేకమైన విషయం ఏమిటంటే మీరు ఇక్కడ బంగీ జంపింగ్‌ను కూడా ఆస్వాదించవచ్చు. భారతదేశంలోనే ఎత్తైన బంగీ జంపింగ్ ఇక్కడ జరుగుతుంది. దీని ఎత్తు 83 మీటర్లు. రిషికేశ్‌లో, శివపురి , మోహన్ చట్టి వంటి ప్రదేశాలలో బంగీ జంపింగ్ చేస్తారు. రిషికేశ్ ప్రశాంతమైన వాతావరణానికి ప్రసిద్ధి చెందడమే కాదు మీరు ఇక్కడ అనేక రకాల సాహస కార్యకలాపాలను కూడా చేయవచ్చు. అత్యంత ప్రత్యేకమైన విషయం ఏమిటంటే మీరు ఇక్కడ బంగీ జంపింగ్‌ను కూడా ఆస్వాదించవచ్చు. భారతదేశంలోనే ఎత్తైన బంగీ జంపింగ్ ఇక్కడ జరుగుతుంది. దీని ఎత్తు 83 మీటర్లు. రిషికేశ్‌లో, శివపురి , మోహన్ చట్టి వంటి ప్రదేశాలలో బంగీ జంపింగ్ చేస్తారు.

3 / 7

లోనావాలా.. ముంబైలో నివసిస్తున్నా లేదా అక్కడికి వెళ్లాలని ప్లాన్ చేస్తుంటే లోనావాలా పేరు ఖచ్చితంగా మీ పర్యటన జాబితాలో ఉండాలి. ఈ ప్రదేశం ఎంత అందంగా ఉంటుందో అంతే వినోద కార్యక్రమాలు కూడా జరుగుతాయి. ఈ ప్రదేశాన్ని సందర్శించడం ద్వారా మీరు ప్రశాంతతను అనుభవిస్తారు. మీరు ఇక్కడ బంగీ జంపింగ్ కూడా చేయవచ్చు. ఇక్కడ బంగీ జంపింగ్ ఎత్తు 28 మీటర్లు. ఇక్కడ మీరు ఈ క్రీడను సురక్షితంగా ఆడేలా చేస్తారు. అందమైన దృశ్యాలను ఆస్వాదిస్తూ మీరు ఇక్కడ బంగీ జంపింగ్ చేయవచ్చు. లోనావాలా.. ముంబైలో నివసిస్తున్నా లేదా అక్కడికి వెళ్లాలని ప్లాన్ చేస్తుంటే లోనావాలా పేరు ఖచ్చితంగా మీ పర్యటన జాబితాలో ఉండాలి. ఈ ప్రదేశం ఎంత అందంగా ఉంటుందో అంతే వినోద కార్యక్రమాలు కూడా జరుగుతాయి. ఈ ప్రదేశాన్ని సందర్శించడం ద్వారా మీరు ప్రశాంతతను అనుభవిస్తారు. మీరు ఇక్కడ బంగీ జంపింగ్ కూడా చేయవచ్చు. ఇక్కడ బంగీ జంపింగ్ ఎత్తు 28 మీటర్లు. ఇక్కడ మీరు ఈ క్రీడను సురక్షితంగా ఆడేలా చేస్తారు. అందమైన దృశ్యాలను ఆస్వాదిస్తూ మీరు ఇక్కడ బంగీ జంపింగ్ చేయవచ్చు.

4 / 7

గోవాలో బంగీ జంపింగ్: గోవా బీచ్‌లు, పార్టీలకు ప్రసిద్ధి చెందింది. అయితే ఈ ప్రదేశంలో మీరు బంగీ జంపింగ్ కూడా ఆనందించవచ్చని మీకు తెలుసా. ఇక్కడ గ్రావిటీ జోన్‌లో, అంజునా బీచ్‌లో 35 మీటర్ల ఎత్తులో బంగీ జంపింగ్ జరుగుతుంది. దేశ విదేశాల నుంచి ప్రజలు బంగీ జంపింగ్ చేయడానికి ఇక్కడికి వస్తారు. ఈ బీచ్ బంగీ జంపింగ్ కు ప్రసిద్ధి చెందింది. గోవాలో బంగీ జంపింగ్: గోవా బీచ్‌లు, పార్టీలకు ప్రసిద్ధి చెందింది. అయితే ఈ ప్రదేశంలో మీరు బంగీ జంపింగ్ కూడా ఆనందించవచ్చని మీకు తెలుసా. ఇక్కడ గ్రావిటీ జోన్‌లో, అంజునా బీచ్‌లో 35 మీటర్ల ఎత్తులో బంగీ జంపింగ్ జరుగుతుంది. దేశ విదేశాల నుంచి ప్రజలు బంగీ జంపింగ్ చేయడానికి ఇక్కడికి వస్తారు. ఈ బీచ్ బంగీ జంపింగ్ కు ప్రసిద్ధి చెందింది.

5 / 7

బెంగళూరులో సరదా బంగీ జంపింగ్: బెంగళూరు ఐటీ హబ్‌గా ప్రసిద్ధి చెందింది. అయితే ఆఫీసు సంస్కృతికి అతీతంగా, ఈ ప్రదేశం సాహస కార్యక్రమాలతో నిండి ఉంది. బంగీ జంపింగ్ కోసం పర్యాటకులు ఎల్లప్పుడూ ఇక్కడికి వస్తారు. ఇక్కడ బంగీ జంపింగ్ 25 మీటర్ల ఎత్తులో జరుగుతుంది. ఇక్కడ బంగీ జంపింగ్ చేసే సరదా వేరు. బెంగళూరులో సరదా బంగీ జంపింగ్: బెంగళూరు ఐటీ హబ్‌గా ప్రసిద్ధి చెందింది. అయితే ఆఫీసు సంస్కృతికి అతీతంగా, ఈ ప్రదేశం సాహస కార్యక్రమాలతో నిండి ఉంది. బంగీ జంపింగ్ కోసం పర్యాటకులు ఎల్లప్పుడూ ఇక్కడికి వస్తారు. ఇక్కడ బంగీ జంపింగ్ 25 మీటర్ల ఎత్తులో జరుగుతుంది. ఇక్కడ బంగీ జంపింగ్ చేసే సరదా వేరు.

6 / 7

గురుగ్రామ్: గురుగ్రామ్‌లో కూడా బంగీ జంపింగ్ చేయవచ్చని తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. గురుగ్రామ్‌లోని బ్యాక్‌యార్డ్ స్పోర్ట్స్ క్లబ్‌లో మీరు బంగీ జంపింగ్‌ను ఆస్వాదించవచ్చు. ఇక్కడ బంగీ జంపింగ్ 60 మీటర్ల ఎత్తులో జరుగుతుంది. గురుగ్రామ్: గురుగ్రామ్‌లో కూడా బంగీ జంపింగ్ చేయవచ్చని తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. గురుగ్రామ్‌లోని బ్యాక్‌యార్డ్ స్పోర్ట్స్ క్లబ్‌లో మీరు బంగీ జంపింగ్‌ను ఆస్వాదించవచ్చు. ఇక్కడ బంగీ జంపింగ్ 60 మీటర్ల ఎత్తులో జరుగుతుంది.

ఈ టీ మీ ఆరోగ్యానికి సహజ సంజీవని.. ఉదయాన్నే తాగితే ఆ వ్యర్థాలన్నీ బయటకు

‘సుగంధ ద్రవ్యాల రాణి’గా పిలవబడే ఏలకులు కేవలం వంటకాలకు రుచిని జోడించడమే కాకుండా, ఆరోగ్యానికి అమృతంలా పనిచేస్తాయి. పురాతన కాలం నుండి సాంప్రదాయ వైద్యంలో ఉపయోగించబడుతున్న ఈ సుగంధ ద్రవ్యం, టీ రూపంలో తీసుకుంటే శరీరాన్ని శుద్ధి చేసి, నోటి ఆరోగ్యం నుండి గుండె, కాలేయం వరకు అనేక ప్రయోజనాలను అందిస్తుంది. ఏలకుల టీ తయారీ విధానం, దాని అద్భుతమైన ఆరోగ్య లాభాలను తెలుసుకుని, మీ రోజువారీ జీవనంలో ఈ సహజ సంజీవనిని చేర్చుకోండి యాలకులను ‘సుగంధ ద్రవ్యాల రాణి’గా పిలుస్తారు. ఇది భారతదేశం, శ్రీలంక మధ్య అమెరికాలో ఎక్కువగా సాగు చేస్తుంటారు. పురాతన కాలం నుండి వంట సాంప్రదాయ వైద్యంలో దీనిని ఉపయోగిస్తున్నారు. ఇది దాల్చిన చెక్క, జాజికాయ, లవంగాలు అల్లం వంటి వేడిని కలిగించే లక్షణాలను కలిగి ఉంది. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న తీపి రుచికరమైన వంటకాలకు రుచిని జోడిస్తుంది. అంతేకాదు ఈ కింది ప్రయోజనాలను కూడా చేకూరుస్తుంది.

నోటి ఆరోగ్యానికి వరం

ఏలకుల టీ నోటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇది నోటి దుర్వాసనను తొలగించి, శ్వాసను తాజాగా, సుగంధంగా ఉంచుతుంది. యాంటీ బాక్టీరియల్ గుణాలు నోటిలో బ్యాక్టీరియా వృద్ధిని అడ్డుకుంటాయి, దంతాలు, చిగుళ్ల సమస్యలను తగ్గిస్తాయి.

జీర్ణక్రియ సమస్యలకు పరిష్కారం

ఈ టీ జీర్ణ వ్యవస్థను బలోపేతం చేస్తుంది. అజీర్ణం, గ్యాస్, అసిడిటీ వంటి సమస్యలను తగ్గించి, ఆహారం సులభంగా జీర్ణం కావడానికి సహాయపడుతుంది. భోజనం తర్వాత ఒక కప్పు టీ తాగితే కడుపు తేలికగా అనిపిస్తుంది.

శరీర శుద్ధి, రోగనిరోధక శక్తి

ఏలకుల్లోని యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ను నియంత్రించి, కణాల నష్టాన్ని తగ్గిస్తాయి. ఈ టీ శరీరంలో పేరుకుపోయిన టాక్సిన్స్‌ను తొలగించి, కాలేయం, మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుతుంది. యాంటీవైరల్, యాంటీ బాక్టీరియల్ గుణాలు రోగనిరోధక శక్తిని పెంచి, జలుబు, ఫ్లూ వంటి ఇన్ఫెక్షన్ల నుండి రక్షిస్తాయి.

బరువు నియంత్రణ, గుండె ఆరోగ్యం

ఏలకుల టీ జీవక్రియను వేగవంతం చేసి, శరీరంలోని అదనపు కొవ్వును కరిగిస్తుంది, బరువు నియంత్రణకు సహాయపడుతుంది. అధిక పొటాషియం కంటెంట్ రక్తపోటును తగ్గించి, రక్తనాళాల ఒత్తిడిని నియంత్రిస్తుంది. రోజూ ఒక కప్పు టీ తాగడం హృదయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

మానసిక ప్రశాంతతకు సహాయం



ఏలకుల టీ మనసును ప్రశాంతంగా ఉంచుతుంది. ఒత్తిడి, ఆందోళనతో బాధపడేవారికి ఇది సహజ ఉపశమనం అందిస్తుంది. హార్మోన్ల సమతుల్యతను కాపాడి, మానసిక సంతోషాన్ని పెంచుతుంది.

జాగ్రత్తలుజి

ఏలకులు వేడి స్వభావం కలిగి ఉంటాయి కాబట్టి, అతిగా తీసుకోవడం వల్ల అసౌకర్యం కలగవచ్చు.

గర్భిణీ స్త్రీలు, దీర్ఘకాల వ్యాధులతో బాధపడేవారు వైద్య సలహా తీసుకోవాలి.

అలెర్జీలు ఉన్నవారు తక్కువ మోతాదుతో ప్రారంభించి, శరీర స్పందనను పరిశీలించాలి.

పెళ్లిళ్ల స్పెషల్ నోరూరించే గుమ్మడి వడియాలు.. రుచిగా పెట్టే సులభమైన విధానం!



ఎండాకాలం వచ్చిందంటే చాలు, ప్రతి తెలుగు ఇంటి వాకిలిలోనూ కనిపించే ఒక ప్రత్యేకమైన దృశ్యం గుమ్మడి వడియాలు. బంగారు వర్ణంలో మెరిసే ఈ చిన్న చిన్న ముక్కలు కేవలం రుచికరమైనవే కాదు, మన సంస్కృతిలో ఒక భాగం కూడా. మరి ఈ గుమ్మడి వడియాలను ఈజీగా పక్కా కొలతలతో ఎలా పెట్టుకోవాలి... తయారీ విధానం వంటివి చదివేయండి.. గుమ్మడి వడియాలంటే ఇష్టపడని వారుండరు. ఎండాకాలంలో చేసుకునే నిల్వ ఆహారాల్లో వీటని కచ్చితంగా చేర్చుతుంటారు. ఈ వడియాలను కూరల్లో, పులుసుల్లో వేసుకుంటే ప్రత్యేకమైన రుచి వస్తుంది. మరి, గుమ్మడి వడియాలు టేస్టీగా ఎలా పెట్టాలో తెలుసుకుందాం రండి.

కావలసిన పదార్థాలు:

గుమ్మడికాయ 1 (సుమారు 1 కిలో) బియ్యప్పిండి 1 కప్పు (లేదా మీ గుమ్మడి తురుము యొక్క పరిమాణానికి తగినంత) పచ్చిమిర్చి 2-3 (మీ రుచికి తగినట్లు) అల్లం చిన్న ముక్క (ఒక ఇంచు) జీలకర్ర 1 టీస్పూన్ ఉప్పు రుచికి తగినంత నూనె వడియాలు పెట్టడానికి (ఆప్షనల్)

తయారీ విధానం:

ముందుగా గుమ్మడికాయను శుభ్రంగా కడిగి, దాని తొక్క తీసేయాలి. లోపలి గింజలు, మెత్తటి గుజ్జును పూర్తిగా తొలగించాలి. గుమ్మడికాయను తురుము పీటతో పలుకుగా తురుముకోవాలి. మరీ మెత్తగా కాకుండా కొంచెం బరకగా ఉంటే వడియాలు రుచిగా ఉంటాయి. తురిమిన గుమ్మడి తురుమును ఒక పలుచని కాటన్ గుడ్డలో వేసి గట్టిగా పిండి నీరంతా తీసివేయాలి. ఇది చాలా ముఖ్యమైన దశ. నీరు ఉంటే వడియాలు సరిగ్గా ఎండవు మరియు పాడైపోయే అవకాశం ఉంది.ఒక పెద్ద గిన్నెలో పిండిన గుమ్మడి తురుము వేయాలి. అందులో బియ్యప్పిండి, సన్నగా తరిగిన పచ్చిమిర్చి, తురిమిన అల్లం, జీలకర్ర రుచికి తగినంత ఉప్పు వేయాలి. ఈ పదార్థాలన్నింటినీ బాగా కలపాలి. పిండి గుమ్మడి తురుముతో కలిసి ముద్దలాగా రావాలి. అవసరమైతే కొద్దిగా బియ్యప్పిండిని కలుపుకోవచ్చు, కానీ మరీ ఎక్కువ పిండి వేయడం వల్ల గుమ్మడి రుచి తగ్గిపోతుంది.

వడియాలకు ప్రిపరేషన్:

ఒక ప్లాస్టిక్ షీట్ లేదా శుభ్రమైన కాటన్ గుడ్డను ఎండలో వేయాలి. మీ చేతులకు కొద్దిగా నూనె రాసుకొని (లేదా నూనె లేకుండానే), తయారుచేసిన మిశ్రమం నుండి చిన్న చిన్న ఉండలుగా తీసుకుని వడియాల ఆకారంలో ఒత్తుకోవాలి. మీకు నచ్చిన ఆకారంలో (చిన్నవి లేదా పెద్దవి) పెట్టుకోవచ్చు. కొందరు గుండ్రంగా పెడతారు, మరికొందరు కొంచెం పొడవుగా పెడతారు. పెట్టిన వడియాలను నేరుగా ఎండలో 2-3 రోజుల పాటు బాగా ఎండబెట్టాలి. ప్రతిరోజూ ఒకసారి వాటిని తిప్పుతూ ఉండాలి, అప్పుడే అన్ని వైపులా సమానంగా ఎండిపోతాయి. వడియాలు గట్టిగా, పూర్తిగా పొడిబారే వరకు ఎండబెట్టాలి. వడియాలు పూర్తిగా ఎండిపోయిన తర్వాత వాటిని ఒక గాలి చొరబడని డబ్బాలో లేదా కవర్లో నిల్వ చేసుకోవాలి. ఇలా నిల్వ చేసుకుంటే చాలా కాలం పాటు తాజాగా ఉంటాయి.

రుచి కోసం మరికొన్ని చిట్కాలు:

మీరు కావాలంటే కొద్దిగా ఇంగువ కూడా కలపవచ్చు. ఇది వడియాలకు మంచి సువాసనను ఇస్తుంది.

కొంతమంది కొత్తిమీర లేదా కరివేపాకు కూడా సన్నగా తరిగి కలుపుతారు.

పచ్చిమిర్చికి బదులుగా కొద్దిగా కారం కూడా వేసుకోవచ్చు.

ఇలా చేస్తే మీ గుమ్మడి వడియాలు చాలా రుచిగా వస్తాయి. వీటిని వేయించుకొని నేరుగా తినవచ్చు లేదా కూరల్లో, పులుసుల్లో వేసుకొని ఆస్వాదించవచ్చు.

ఈ సమయంలో గోళ్లు కత్తిరిస్తున్నారా..? అయితే ఇది మీకోసమే..!



మన ఇంట్లో పెద్దవాళ్లు తరచూ చెప్పే మాట.. రాత్రిపూట గోళ్లు కత్తిరించవద్దని.. ఇది ఒక సాధారణ సూచనలా అనిపించినా.. దీని వెనుక ఉన్న కారణాలు శాస్త్రం, ఆరోగ్యం, సంప్రదాయ విశ్వాసాలతో చాలా అనుబంధం కలిగి ఉంటాయి. ఈ అలవాటు ఎందుకు వచ్చిందో అర్థం చేసుకోవాలి. పురాతన నమ్మకాల ప్రకారం రాత్రిపూట కొన్ని చెడు శక్తులు ఎక్కువగా తిరుగుతాయట. ఆ సమయంలో గోళ్లు కత్తిరిస్తే ఆ శక్తులు మనకు కష్టాలు కలిగిస్తాయని అనుకునేవారు. కొందరు రాత్రిపూట చంద్రుడి శక్తి చాలా ఎక్కువగా ఉంటుందని నమ్ముతారు. గోళ్లు తీసేస్తే ఆ శక్తి తగ్గిపోతుందని కూడా భావించేవారు. శాస్త్రంలో కూడా రాత్రిపూట గోళ్లు కత్తిరించడం వల్ల శరీరం సమతుల్యత దెబ్బతింటుందని చెబుతారు. విద్యుత్ అందుబాటులో లేని రోజులలో రాత్రిపూట వెలుతురు చాలా తక్కువగా ఉండేది. అప్పుడు దీపాల వెలుతురులో గోళ్లు కత్తిరించడం ప్రమాదకరం. ఒక్కసారి తప్పుగా కత్తిరిస్తే వేళ్లకు గాయం అయ్యే అవకాశం ఉండేది. అందుకే రాత్రిపూట గోళ్లు కత్తిరించకూడదని చెప్పారు. ఇది పూర్తిగా భద్రతతో సంబంధం ఉన్న విషయం. సాయంత్రం అయ్యాక మన శరీరం నిద్రపోవడానికి తయారవుతుంది. రోజంతా పని చేసి అలిసిపోయిన శరీరం అప్పుడు రెస్ట్ తీసుకోవాలనుకుంటుంది. అలాంటి టైమ్‌లో పదునైన వస్తువులు పట్టుకోవడం, జాగ్రత్తగా చేయాల్సిన పనులు చేయడం మంచిది కాదు. గోళ్లు కత్తిరించడం అంటే చాలా శ్రద్ధగా చేయాల్సిన పని. అలసటగా ఉన్నప్పుడు సరిగ్గా చేయకపోతే ప్రమాదం జరిగే ఛాన్స్ ఉంది. గోళ్లు కత్తిరించినప్పుడు చిన్న చిన్న ముక్కలు కింద పడతాయి. వాటికి బ్యాక్టీరియా లేదా దుమ్ము అంటుకుని ఉండొచ్చు. పగటిపూట లైట్‌లో అవి బాగా కనిపిస్తాయి కాబట్టి వాటిని తీసి పారేయొచ్చు. కానీ రాత్రిపూట మంచం మీద కూర్చొని గోళ్లు కత్తిరిస్తే అవి అక్కడే పడిపోతాయి. పొరపాటున అవి మనం తినే ఆహారంలో కలిసిపోయే ఛాన్స్ ఉంది. అలా జరిగితే ఆరోగ్యం పాడవుతుంది. అంతేకాదు ఆ గోళ్ల ముక్కలకు చీమలు, చిన్న పురుగులు కూడా వస్తాయి. రాత్రిపూట గోళ్లు కత్తిరించకూడదనే సలహా కేవలం మూఢనమ్మకం కాదు. దీనివెనుక భద్రత, పరిశుభ్రత, ఆరోగ్యం, శారీరక స్థితి అన్నీ మిళితమై ఉన్నాయి. పగటిపూట వెలుతురులో గోళ్లు కత్తిరించడం వల్ల గాయాల ప్రమాదం తగ్గుతుంది. అదనంగా పరిశుభ్రంగా ఉండే అవకాశం కూడా ఎక్కువ. నేలపై కాగితం లేదా బట్టను పరచి ఆపై కత్తిరిస్తే గోళ్లు ఒక్కచోటే చేరుతాయి. మన పెద్దల సూచనను నిర్లక్ష్యం చేయకుండా వెలుతురు ఉన్న సమయంలో గోళ్లు కత్తించటం మంచి అలవాటు.

జుట్టు రాలడం ఆగాలంటే ఈ నీళ్లు తాగాల్సిందే..! ఇది మంచి టానిక్ లా పని చేస్తుంది..!



ప్రతి ఒక్కరికి ఆరోగ్యంగా మెరిసే జుట్టు కావాలని ఉంటుంది. ఈ రోజుల్లో జుట్టు రాలడం, పెరగకపోవడం, బలహీనత వంటి సమస్యలు చాలా మందిలో కనిపిస్తున్నాయి. ఇలాంటి సమయంలో సహజమైన మునగ ఆకుల నీరు బాగా ఉపయోగపడుతుంది. దీన్ని తాగడం వల్ల జుట్టు బలంగా మారుతుంది. మునగ ఆకులు విటమిన్ %ూా, జ, జు, దీ% లను అందిస్తాయి. ఇందులో ఐరన్, జింక్, అమైనో ఆమ్లాలు కూడా ఉంటాయి. ఇవి అన్ని కలిసి జుట్టు మూలాలను బలంగా మార్చడంలో సహాయపడతాయి. ఆకులలో ఉండే పోషకాలు జుట్టు ఎదుగుదలకు అవసరమైన సహజ మార్గం అందిస్తాయి. మునగ గింజలు కూడా శక్తివంతంగా పనిచేస్తాయి. మునగ ఆకుల నీటిని తాగడం వల్ల శరీరానికి శక్తి వస్తుంది. జీర్ణక్రియ మెరుగవుతుంది. తల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. జుట్టు బలంగా, మెత్తగా, ప్రకాశవంతంగా మారుతుంది. తలలో కొత్త జుట్టు మొదలవుతుంది. ఇది సాధారణంగా రసాయనాలు వాడకుండా చక్కగా పెరిగే సహజ మార్గం. గుప్పెడు తాజా మునగ ఆకులను తీసుకొని శుభ్రంగా కడగాలి. వీటిలో ఉండే మురికి తొలగించాలి. తరువాత రెండు కప్పుల నీటిని మరిగించాలి. నీరు మరిగిన తర్వాత అందులో ఆకులను వేసి 10 నిమిషాలు ఇంకా మరిగించాలి. తరువాత వడకట్టి నీరు చల్లార్చి తాగాలి. దీనిని ఖాళీ కడుపుతో తీసుకుంటే బాగా పని చేస్తుంది. మునగకాయలను చిన్న ముక్కలుగా రెండు కట్ చేసుకోవాలి. ఇప్పుడు రెండు కప్పుల నీటిని మరిగించి అందులో ఈ ముక్కలు వేసి 10 నిమిషాలు మరిగించాలి. తరువాత వడకట్టి చల్లబర్చాలి తాగాలి. ఉదయం ఖాళీ కడుపుతో తాగాలి. ఒక కప్పుతో మొదలుపెట్టి, క్రమంగా రెండు కప్పుల వరకు తీసుకోవచ్చు. రుచి సరిగా అనిపించకపోతే తేనె లేదా నిమ్మరసం కొద్దిగా వేసుకోవచ్చు. దీన్ని వారంలో మూడుసార్లు తాగినా సరిపోతుంది. క్రమంగా రెండు నెలలు తాగితే మంచి ఫలితాలు కనిపిస్తాయి. మునగ నీటిని తాగడమే కాకుండా.. తల కడుక్కోవడానికి కూడా వాడొచ్చు. తలపై ఈ నీటిని పోస్తే తల చర్మం చల్లగా ఉంటుంది. దీంతో తలలో రక్త ప్రసరణ మెరుగవుతుంది. జుట్టు బలంగా మారుతుంది. మునగ నీటిలో విటమిన్ ఎక్కువగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. శరీరంలో ఉన్న విషాలను బయటకు పంపుతుంది. చర్మానికి మెరుపు తీసుకువస్తుంది. జుట్టు ఎదుగుదల క్రమంగా మెరుగవుతుంది.

ఇంట్లోనే తక్కువ ఖర్చుతో జుట్టు సమస్యలకు చెక్ పెట్టొచ్చు..!



అరటి పండు తిన్నాక మిగిలే తొక్కను చాలా మంది వ్యర్థంగా వదిలేస్తారు. కానీ అది జుట్టు సంరక్షణలో అద్భుత ఫలితాలు ఇస్తుంది. సహజంగా దొరికే ఈ తొక్కను సరైన రీతిలో వాడితే జుట్టు రాలే సమస్య తగ్గుతుంది. తల చర్మానికి పోషణ ఇస్తూ కొత్త జుట్టు పెరగడంలో సహాయపడుతుంది. అరటి పండు తిన్నాక మిగిలిపోయే తొక్కను చాలా మంది విసిరేస్తారు. కానీ అదే తొక్క జుట్టుకు అద్భుతంగా పనిచేస్తుంది. సరైన రీతిలో వాడితే ఇది జుట్టు రాలడాన్ని తగ్గించటమే కాకుండా కొత్త జుట్టు పెరగడంలో సహాయపడుతుంది. ఆరోగ్యంగా జుట్టు పెరగాలంటే దీన్ని ఉపయోగించడం మంచిది.

అరటి తొక్కలో చాలా పోషకాలు

పొటాషియం.. ఇది తలపై తేమను నిలుపుతుంది. తల చర్మం పొడి కాకుండా ఉండేలా చూస్తుంది.

మెగ్నీషియం.. ఇది తల చర్మంలో రక్తప్రసరణను మెరుగుపరుస్తుంది.

విటమిన్ ఇవి జుట్టు ఫోలికల్స్ కు బలం ఇస్తాయి.

ఇవి జుట్టు రాలే సమస్య తగ్గించడంలో సహాయపడతాయి.

హెయిర్ మాస్క్

పండిన అరటి తొక్క 1, కొబ్బరి నూనె 1 టీస్పూన్, తేనె 1 టీస్పూన్. ఈ మూడు పదార్థాలను బాగా మిక్స్ చేయాలి. ఈ మిశ్రమాన్ని తలకు పట్టించి 30 నిమిషాలు ఉంచాలి. తర్వాత తల శుభ్రంగా కడగాలి. ఇది తలకు పోషణ అందించి జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది.

అరటి తొక్క వాటర్ వాష్

అరటి తొక్క 1, నీరు 2 కప్పులు. అరటి తొక్కను నీటిలో 10 నిమిషాలు మరిగించాలి. చల్లారిన తర్వాత ద్రవాన్ని వడకట్టాలి. ఈ నీటిని చల్లార్చి తల కడిగిన తర్వాత చివరిగా తలపై పోయాలి. ఇది తల చర్మాన్ని తేమగా ఉంచుతుంది. జుట్టు మెత్తగా మారుతుంది.

అరటి తొక్కతో ఆయిల్

అరటి తొక్క 1, కొబ్బరి లేదా ఆలివ్ నూనె అర కప్పు. ఒక చిన్న పాత్రలో నూనె వేడి చేయాలి. అందులో తొక్క వేసి 10 నిమిషాలు మరిగించాలి. మరిగిన తరువాత వడకట్టి ఒక సీసాలో నిల్వ చేయాలి. ఈ నూనెను తలకు అప్లై చేసి అరగంట తర్వాత తల కడిగితే జుట్టు కాంతివంతంగా మారుతుంది. మీ తల చర్మం సున్నితంగా ఉంటే.. ఈ నూనెను మొదట కొద్దిగా పరీక్షించి చూడటం మంచిది. ఈ నూనెను ఉపయోగించే ముందు చల్లబరచాలి. సాధారణంగా వారానికి ఒక్కసారి ఈ నూనెను వాడితే సరిపోతుంది. అంతకంటే ఎక్కువగా ఉపయోగించాల్సిన అవసరం లేదు. కేవలం అరటి తొక్కతో ఇంట్లోనే తక్కువ ఖర్చుతో జుట్టు సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. దీనిలో రసాయనాలు లేవు, సైడ్ ఎఫెక్ట్ కూడా ఉండవు. కొద్దికాలం పాటు క్రమంగా వాడితే జుట్టులో మంచి మార్పు కనిపిస్తుంది. ఈ పదార్థాలు సహజమైనవే అయినా..

షాకిచ్చిన అమూల్, నందిని.. నెయ్యి, వెన్న ధరలు భారీగా పెంపు..!



ప్రముఖ డైరీ సంస్థ అమూల్ పండక్కి ముందే ప్రజలకు షాక్ ఇచ్చింది. అమూల్ తన నెయ్యి, వెన్న ఉత్పత్తుల రిటైల్ ధరలను దేశవ్యాప్తంగా పెంచింది. దీని ప్రకారం 1 కిలో నెయ్యి ప్యాకెట్ ధర రూ. 50, 500 గ్రాముల వెన్న ప్యాకెట్ ధర రూ. 15 పెరిగాయి. ఈ కొత్త ధరలు తక్షణమే అమల్లోకి వచ్చాయి. ఉత్పత్తుల లేబుళ్లపై, అలాగే ఆన్‌లైన్ రిటైల్ ప్లాట్‌ఫారమ్‌లలో అప్‌డేట్ చేసినట్లు అమూల్ ప్రకటించింది. తాజా సవరణల తర్వాత, 1 కిలోల అమూల్ నెయ్యి ప్యాకెట్ ధర గతంలో ఉన్న రూ. 630 నుంచి రూ. 680కి పెరిగింది. అలాగే, 500 గ్రాముల స్వచ్ఛమైన నెయ్యి ప్యాకెట్ ధర రూ. 325 నుంచి రూ. 345కి (రూ. 20 పెంపు) చేరింది. కంపెనీ తన వెన్న ప్యాకెట్ల ధరలను కూడా సవరించింది. గతంలో రూ. 63గా ఉన్న 100 గ్రాముల వెన్న ప్యాకెట్ ధర ఇప్పుడు రూ. 66కి పెరిగింది. అదేవిధంగా 500 గ్రాముల వెన్న ప్యాకెట్ ధర గతంలో రూ. 310 ఉండగా, ఇప్పుడు రూ. 325కి పెరిగింది. ఈ ధరల పెంపు వివిధ పరిమాణాల్లో నెయ్యి, వెన్న ఉత్పత్తులను కొనుగోలు చేసే వినియోగదారులపై ప్రభావం చూపనుంది. అంతకుముందు ఈ ఏడాది మే నెలలో అమూల్ తన తాజా పాల ప్యాకెట్ల ధరలను లీటరుకు రూ. 2 చొప్పున పెంచింది. మే 14 నుంచి అమల్లోకి వచ్చిన ఈ పెంపు, గోల్డ్, తాజా, శక్తి, ఆవు పాలు వంటి ప్రధాన రకాల పాలపై వర్తించింది. ూశ్రీంశీ =ష్ణఎ దీవఅస్త్రుశ్రీబతీబ: బెంగళూరు వాసులకు షాక్.. భారీగా పెరిగిన బస్ ఛార్జీలు..! అప్పట్లో, అమూల్ బ్రాండ్ పేరుతో ఉత్పత్తులను విక్రయించే 'గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్', పశుగ్రాసం, ప్యాకేజింగ్ సామాగ్రి, ఇంధన ధరలు పెరగడం వల్ల పాల ధరలను సవరించాల్సి వచ్చిందని పేర్కొంది. అంతేకాకుండా పాల ఉత్పత్తిదారులకు (రైతులకు) చెల్లించే సేకరణ ధరలను పెంచడం కూడా ఈ ధరల పెంపునకు ఒక కారణమని ఫెడరేషన్ వివరించింది. మే నెలలో జరిగిన ఈ సవరణ వల్ల లీటరు పాల ధర సుమారు 2.5 నుంచి 3.5 శాతం వరకు పెరిగింది. ప్రస్తుతం పండుగల సీజన్ నడుస్తున్న తరుణంలో నెయ్యి, వెన్న ధరలు పెరగడం వల్ల ప్రజలపై భారం పడే అవకాశం ఉంది. ఈ సమయంలోనే గృహ అవసరాలకు, వంటకాల తయారీకి వీటి వినియోగం ఎక్కువగా ఉంటుంది. కర్ణాటకకు చెందిన 'నందిని' బ్రాండ్, పాలు మరియు పెరుగు ధరలను పెంచిన వారం రోజులకే, వినియోగదారులపై మరో భారాన్ని మోపింది. రాష్ట్రవ్యాప్తంగా నెయ్యి, వెన్న, పనీర్ ధరలను కూడా పెంచింది. ముఖ్యంగా నందిని నెయ్యి ధర గణనీయంగా పెంచింది. గతంలో రూ. 715గా ఉన్న ఒక లీటర్ నెయ్యి ప్యాకెట్ ధర, ఇప్పుడు రూ. 850కి చేరింది. అలాగే ఒక కిలో పనీర్ ప్యాకెట్ ధర రూ. 408 నుండి రూ. 485కి పెంచింది. 500 గ్రాముల ఉప్పు లేని వెన్న ధర రూ. 285 నుంచి రూ. 390కి పెరిగింది. బెంగళూరు మిల్క్ యూనియన్ ప్రకటించిన ఈ కొత్త ధరలు నవంబర్ 4 నుండి అమల్లోకి వచ్చాయి. నందిని ఇప్పటికే లీటర్ పాలపై రూ.8 పెంచింది. ఇది నవంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చింది. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

సౌదీ అరేబియా వెళ్తున్నారా.. అత్యవసర హెచ్చరికలు జారీ చేసిన ఆ దేశం..!



సౌదీ అరేబియా పౌర రక్షణ విభాగం గురువారం షరూరా, యాన్బు గవర్నరేట్లలో జాతీయ ముందస్తు అత్యవసర హెచ్చరికలు జారీ చేసింది. ప్రమాదం గురించి అప్రమత్తం చేస్తూ, భద్రతా సూచనలను పాటించాలని కోరాయి. అధికారులు నివాసితులను ప్రశాంతంగా ఉండాలని, వెంటనే సమీపంలోని సురక్షిత ప్రదేశానికి, వీలైతే కిటికీలకు దూరంగా ఉన్న భవనం లేదా లోపలి గదికి వెళ్లాలని కోరారు. ప్రమాదం తొలగిపోయే వరకు ఇంట్లోనే ఉండాలని, బహిరంగ ప్రదేశాలు, కిటికీలు, గాజు, బాల్కనీలకు దూరంగా ఉండాలని నివాసితులకు సూచించింది. బయట ఉన్నవారు సమీపంలోని భవనంలోకి ప్రవేశించాలని లేదా గట్టి అడ్డంకి వెనుక ఆశ్రయం పొందాలని ఆదేశించారు. వాహనం నడుపుతున్నప్పుడు అత్యవసర హెచ్చరిక అందుకున్న వాహనదారులు వంతెనలు, ఎత్తైన భవనాలకు దూరంగా వాహనాలను ఆపాలని సూచించారు. పౌర రక్షణ విభాగం, ప్రమాదకర ప్రదేశాల వద్ద గుమికూడవద్దని లేదా సంఘటనలను చిత్రీకరించవద్దని నివాసితులను హెచ్చరించారు. అధికారిక మార్గాల ద్వారా జారీ చేసిన సూచనలను పాటించాలని వారిని కోరింది. అత్యవసర పరిస్థితుల కోసం, మక్కా, మదీనా, రియాద్, తూర్పు ప్రావిన్స్‌లోని నివాసితులు 911కు కాల్ చేయాలని, రాజ్యంలోని ఇతర ప్రాంతాలకు 998 అత్యవసర నంబర్‌గా అందుబాటులో ఉందని సూచించారు. తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ పెరిగిన బంగారం ధరలు.. ఇంకా పెరుగుతాయా..! షరూరా, యాన్బు గవర్నరేట్‌లలో ప్రమాదం తొలగిపోయిందని సౌదీ సివిల్ డిఫెన్స్ ప్రకటించింది. అయినప్పటికీ నివాసితులు భద్రతా సూచనలను పాటించడం కొనసాగించాలని, గుంపులుగా చేరడం, చిత్రీకరణకు దూరంగా ఉండాలని కోరింది. జూలై 2026 నుంచి సౌదీ అరేబియాపై హౌతీ దాడులు పెరిగిన నేపథ్యంలో ఈ హెచ్చరికలు జారీ అయ్యాయి. అక్టోబర్‌లో ఈ దాడులు మరింత తీవ్రమయ్యాయి. దేశం అంతటా విమానాశ్రయాలు, చమురు మౌలిక సదుపాయాలు, సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణి, డ్రోన్ ప్రయోగాలు జరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి. నవంబర్ 4 బుధవారం నాడు రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై జరిగిన తాజా క్షిపణి దాడికి తామే బాధ్యులమని యెమెన్ హౌతీలు ప్రకటించారు. తెలంగాణలోని కామారెడ్డి జిల్లాకు చెందిన 36 ఏళ్ల షేక్ సయీద్ నవంబర్ 3, మంగళవారం నాడు మరణించిన నేపథ్యంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. అక్టోబర్ 10న విమానాశ్రయంపై జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడిన అతను మరణించాడు. నైరుతి యెమెన్‌లో ముఖ్యంగా తైజ్ ప్రావిన్స్‌లో, బాబ్ అల్-మండబ్ జలసంధి సమీప ప్రాంతాలలో హౌతీలకు, సౌదీ మద్దతుగల దళాలకు మధ్య పోరాటం కూడా తీవ్రమైంది. 2014 సెప్టెంబర్‌లో హౌతీలు సనాను స్వాధీనం చేసుకున్న తర్వాత అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ప్రభుత్వానికి మద్దతుగా ఒక కూటమికి నాయకత్వం వహిస్తూ సౌదీ అరేబియా 2015 మార్చిలో యెమెన్‌లో జోక్యం చేసుకుంది. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

రూ.8.30 నుంచి రూ.283 చేరిన స్టాక్ ఇదే..!

స్టాక్ మార్కెట్ లో పెట్టుబడులు చాలా రిస్క్ తో కూడుకున్నది. మార్కెట్లపై ఎలాంటి అవగాహన లేకుండా పెట్టుబడి పెడితే తీవ్ర నష్టాలు వాటిల్లే అవకాశం ఉంది. అయితే మల్టిబ్యాగర్ స్టాక్ ను గుర్తించే పెట్టుబడి పెడితే మంచి రాబడి పొందే అవకాశం ఉంటుంది. మల్టీబ్యాగర్ స్మాల్-క్యాప్ స్టాక్ అయిన హెచ్ఈజీ అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ బుధవారం నాటి ట్రేడింగ్ సెషన్‌ను ఒక్కో షేరుకు రూ.289 వద్ద 20 శాతం అప్పర్ సర్క్యూట్‌లో లాక్ అయింది. సెప్టెంబర్ త్రైమాసికంలో కంపెనీ బలమైన పనితీరు కనబరిచింది. ఎల్ఎన్‌జె భిల్వారా గ్రూప్‌లో భాగమైన హెచ్ఈజీ అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్, బలమైన తయారీ, పరిశోధన అభివృద్ధి ఆవిష్కరణల పునాది మద్దతుతో ముందుకెళ్తోంది. సెప్టెంబర్ 2026తో ముగిసిన త్రైమాసికానికి కంపెనీ కార్యకలాపాల నుండి రూ.430 కోట్ల ఏకీకృత ఆదాయాన్ని నమోదు చేసింది. ఎబిట్డా రూ.313 కోట్లుగా ఉండగా, పన్ను తర్వాత లాభం రూ.209 కోట్లకు చేరింది. అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్‌ను సాంకేతికత-ఆధారిత, ప్రపంచవ్యాప్తంగా పోటీపడగల అధునాతన మెటీరియల్స్ ప్లాట్‌ఫామ్‌గా నిర్మించడంలో కంపెనీ సాధిస్తున్న నిరంతర పురోగతిని 27 రెండవ త్రైమాసిక ఫలితాలు నిదర్శమని అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ రిజు ఝున్‌ఝున్‌వాలా అన్నారు. ఆర్‌డిడిని బలోపేతం చేయడం, యాజమాన్య సాంకేతికతలను అభివృద్ధి చేయడం, యానోడ్ మెటీరియల్స్, గ్రాఫేన్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్, మరియు గ్రీన్ పవర్ రంగాలలో విభిన్నమైన, విస్తరించగల వ్యాపారాలను సృష్టించడంపై కంపెనీ దృష్టి సారించిందని ఆయన చెప్పారు. ఇన్వెస్టర్లు డబ్బులతో రెడీగా ఉండండి.. రూ. 4.5 లక్షల కోట్లు టార్గెట్‌తో 20కి పైగా ఐపీఓలు వచ్చేస్తున్నాయ్.. ప్రపంచవ్యాప్తంగా లిథియం-అయాన్ బ్యాటరీ ఉత్పత్తి 2025లో దాదాపు 2.3 నుంచి 2035 నాటికి దాదాపు 8 ఎజెష్మకు పెరుగుతుందని అంచనా. అదే సమయంలో సెల్ తయారీదారులు తమ సరఫరా చైన్ వైవిధ్యపరుస్తున్నందున 2030 నాటికి చైనా యేతర యానోడ్ డిమాండ్ 1 మిలియన్ టన్నులను మించిపోతుందని అంచనా వేసింది. ఈ డిమాండ్‌ను తీర్చడానికి కంపెనీ 20,000 మీ సామర్థ్యం గల ఫేజ్ యానోడ్ మెటీరియల్స్ ప్లాంట్ నిర్మాణం మొత్తం 61% పురోగతిని సాధించగా, ప్రాసెస్ బిల్డింగ్ 72.25% పూర్తయింది. వాణిజ్య కార్యకలాపాల ప్రారంభ తేదీ జూన్ 2027గా ప్రణాళిక రచించారు. ఫేజ్ లో అదనంగా 24,000 మీ సామర్థ్యం గల ప్లాంట్ ఉంటుంది. దీని జూణ మార్చి 2029గా లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్లాంట్ దేవాస్ సైట్‌లోని ప్రస్తుత మౌలిక సదుపాయాలు, విద్యుత్ కనెక్షన్, భూమిని ఉపయోగించుకుంటుంది. దీనితో కంపెనీ మొత్తం యానోడ్ మెటీరియల్స్ సామర్థ్యం 44,000 మీకి చేరుకుంటుంది. ఈ ఏడాది ఇప్పటివరకు ఈ స్టాక్ 28% లాభపడింది. 2016 నాటి కనిష్ట స్థాయి రూ.8.30 నుంచి ఈ స్టాక్ 3,369 శాతం పెరిగి ప్రస్తుతం ఒక్కో షేరు రూ.283 కు చేరింది. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

ఈ రెండు కంపెనీల స్టాక్స్ మార్కెట్లో దుమ్ములేపాయి.. ఇన్వెస్టర్లు ఓ కన్నేసి ఉంచండి..



అంతర్జాతీయ ఇంధన విపణిలో ముడి చమురు ధరలు అనూహ్యంగా కుప్పకూలడం, దేశీయ స్టాక్ మార్కెట్లు రికార్డు స్థాయి లాభాల్లో పయనించడం వాణిజ్య వాహన తయారీ దిగ్గజాలకు భారీగా కలిసివచ్చింది. అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాల నేపథ్యంలో పశ్చిమాసియాలో ఇరాన్-అమెరికా సైనిక వివాదానికి దౌత్యపరమైన చర్చల ద్వారా త్వరలోనే ముగింపు లభిస్తుందనే అంచనాలు బలపడటం పెట్టుబడిదారులలో విపరీతమైన ఉత్సాహాన్ని నింపింది. ఈ పరిణామాల ఫలితంగా గురువారం నాటి ట్రేడింగ్‌లో ప్రముఖ వాణిజ్య వాహన తయారీ సంస్థలైన అశోక్ లేలాండ్ టాటా మోటార్స్ షేర్లు ఏకంగా 12 శాతం వరకు పెరిగి సరికొత్త గరిష్టాలను తాకాయి. నేటి ట్రేడింగ్ సెషన్‌లో బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ లో అశోక్ లేలాండ్ షేరు ధర ఏకంగా 12 శాతం వరకు ఎగబాకి రూ. 172 స్థాయికి చేరగా, మరో ప్రసిద్ధ వాహన తయారీ దిగ్గజం టాటా మోటార్స్ షేరు 9 శాతం లాభపడి రూ. 440 మార్కును తాకింది. గత రెండు రోజుల్లోనే ముడి చమురు ధరలు దాదాపు 10 శాతం మేర పడిపోవడం ఈ స్టాక్స్ ర్యాలీకి ప్రధానమైన శక్తిగా నిలిచింది. అంతర్జాతీయ బెంచ్‌మార్క్ బ్రెంట్ క్రూడ్ 8.7 శాతం క్షీణించి బ్యారెల్‌కు 94.62 వద్ద ముగియగా.. తదనంతర ట్రేడింగ్‌లో మరింత తగ్గి వి93.51 వద్ద కదలాడుతోంది. అలాగే అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ ముడి చమురు 8.3 శాతం పడిపోయి బ్యారెల్‌కు వి87 దిగువకు చేరింది. స్టాక్ మార్కెట్ టుడే.. పరుగులు పెట్టిన బుల్స్.. ఇన్వెస్టర్లకు లాభాలే లాభాలు.. కారణం ఏంటంటే.. ముడి చమురు ధరలు పడిపోవడం అశోక్ లేలాండ్, టాటా మోటార్స్ వంటి వాణిజ్య వాహన తయారీదారులకు వ్యాపారపరంగా అత్యంత సానుకూలమైన అంశంగా కలిసివచ్చింది. సాధారణంగా ఫ్లీట్ ఆపరేటర్లకు నిర్వహణ వ్యయంలో డీజిల్ ధరలే అతిపెద్ద భారంగా ఉంటాయి. ఇంధన ధరలు తగ్గడం వల్ల లారీలు, బస్సుల యజమానులకు నిర్వహణ ఖర్చులు తగ్గి లాభదాయకత మెరుగుపడుతుంది. ఇది కొత్త వాహనాల కొనుగోలుకు, పాత వాహనాల స్థానంలో కొత్తవి మార్చుకునే 'రిప్లేస్‌మెంట్ డిమాండ్'కు గట్టి ప్రేరణనిస్తుంది. అంతేకాకుండా, తయారీదారులకు కావలసిన ముడిసరుకుల రవాణా ఖర్చులు తగ్గి మార్జిన్లు పెరుగుతాయి. దీనికితోడు ఇంధన ధరల తగ్గుదల ద్రవ్యోల్బణాన్ని అదుపులోకి తెచ్చి రవాణా రంగానికి, సరుకు విక్రయాలకు రెట్టింపు డిమాండ్‌ను సృష్టిస్తుంది. దీనికితోడు మార్కెట్లో నెలకొన్న ఉత్సాహభరిత వాతావరణం కూడా ఆటో రంగానికి నిలకడనిచ్చింది. అమెరికా ఎన్నికల్లో డెమోక్రాట్ల విజయం వల్ల రాజకీయ స్పష్టత రావడంతో దలాల్ స్ట్రీట్‌లో బుల్లిష్ ప్రభంజనం వీచింది. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 1,400 పాయింట్లకు పైగా పెరిగి 78,700 మార్కును దాటగా, నిఫ్టీ 50 సూచీ 400 పాయింట్లకు పైగా ఎగబాకి 24,350 స్థాయిని పునరుద్ధరించుకుంది. ఈ ఆల్-రౌండ్ ర్యాలీతో బిఎస్ఈ నమోదిత కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఏకంగా రూ. 8 లక్షల కోట్లు పెరిగి రూ. 501 లక్షల కోట్లకు చేరింది. నిఫ్టీ ఆటో సూచీ 2 శాతానికి పైగా లాభపడి మార్కెట్లో అగ్రగామిగా నిలిచింది. రాబోయే రోజుల్లో క్రూడ్ ఆయిల్ పతనం మరియు ఆర్థిక కార్యకలాపాల విస్తరణ వల్ల వాణిజ్య వాహనాలకు డిమాండ్ మరింత వేగవంతం కానుందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను సవరించిన హెచ్ డీఎఫ్‌సీ బ్యాంక్..!



ప్రైవేట్ బ్యాంకులైన ఐసీఐసీఐ, యాక్సిస్ బ్యాంకులు ఇప్పటికే ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను సవరించాయి. తాజాగా అతి పెద్ద ప్రైవేట్ రంగ బ్యాంకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కూడా ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను సవరించింది. నవంబర్ 4 నుంచి సవరించిన ఎఫ్డీ వడ్డీ రేట్లు అమలులోకి వచ్చాయి. కొన్ని నిర్దిష్ట కాలపరిమితులపై వడ్డీ రేట్లను 50 బేసిస్ పాయింట్ల వరకు పెంచారు. ఈ మార్పుల తర్వాత, సీనియర్ సిటిజన్లు 3 సంవత్సరాల 1 రోజు నుంచి 5 సంవత్సరాల కాలపరిమితి గల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై గరిష్టంగా 7.20 శాతం వడ్డీని పొందవచ్చు. సాధారణ కస్టమర్లు 3 సంవత్సరాల 1 రోజు నుంచి 10 సంవత్సరాల కాలపరిమితి గల డిపాజిట్లపై గరిష్టంగా 6.60 శాతం వడ్డీని పొందవచ్చు. 60 రోజుల వరకు కాలపరిమితి గల ఎఫ్డీలపై హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వడ్డీ రేట్లలో ఎటువంటి మార్పు చేయలేదు. 61 రోజుల నుంచి 6 నెలల కాలపరిమితి గల ఎఫ్డీలపై వడ్డీ రేటును గతంలో ఉన్న 4.25% నుంచి 4.75 శాతానికి పెంచింది (50 బేసిస్ పాయింట్ల పెంచింది). సాధారణ కస్టమర్ల విషయానికి వస్తే 5 సంవత్సరాల 1 రోజు నుంచి 10 సంవత్సరాల కాలపరిమితి గల డిపాజిట్లపై వడ్డీ రేటును 6.65 శాతం నుంచి 6.60 శాతానికి సవరించారు. బ్యాంక్ పలు కాలపరిమితులపై వడ్డీ రేట్లను పెంచగా, ప్రస్తుతం గరిష్ట వడ్డీ రేటు 7.20 శాతంగా ఉంది. 61 రోజుల నుంచి 6 నెలల కాలపరిమితి గల డిపాజిట్లపై సీనియర్ సిటిజన్లకు ఇప్పుడు 5.25 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది. ఇది గతంలో ఉన్న 4.75 శాతం కంటే 50 బేసిస్ పాయింట్లు ఎక్కువ. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై సీనియర్ సిటిజన్లకు అత్యధిక వడ్డీ అందిస్తున్న బ్యాంకు ఇదే..! 3 సంవత్సరాల 1 రోజు నుంచి 5 సంవత్సరాల కాలపరిమితి గల డిపాజిట్లపై సవరించిన వడ్డీ రేటు 7.20%గా ఉంది. 5 సంవత్సరాల 1 రోజు నుంచి 10 సంవత్సరాల కాలపరిమితి గల డిపాజిట్లపై వడ్డీ రేటును 6.65 శాతం నుంచి 7.10 శాతానికి పెంచింది. 61-89 రోజుల డిపాజిట్లపై 4.25 నుంచి 4.75 శాతానికి సవరించింది. 90 రోజుల నుంచి 6 నెలల వరకు గల డిపాజిట్లపై 4.25 శాతం నుంచి 4.75 శాతానికి పెంచింది. 6 నెలల 1 రోజు నుంచి 9 నెలల వరకు డిపాజిట్లపై 5.50 నుంచి 5.65 శాతం వరకు సవరించింది. 9 నెలల 1 రోజు నుంచి 1 సంవత్సరం లోపు వరకు గల డిపాజిట్లపై 5.75 శాతం నుంచి 5.90 శాతానికి పెంచింది. 18 నెలల నుండి 21 నెలల లోపు వరకు గల డిపాజిట్లపై 6.45 శాతం నుంచి 6.50 శాతానికి పెరిగింది. 21 నెలల నుంచి 2 సంవత్సరాల వరకు గల డిపాజిట్లపై 6.45 నుంచి 6.50 శాతానికి వడ్డీ రేట్లు సవరించింది. 2 సంవత్సరాల 1 రోజు నుంచి 2 సంవత్సరాల 11 నెలల లోపు వరకు గల డిపాజిట్లపై 6.45 శాతం నుంచి 6.55 శాతం వరకు పెంచింది. 2 సంవత్సరాల 11 నెలలు (35 నెలలు) గల డిపాజిట్లపై 6.45 శాతం నుంచి 6.55 శాతానికి సవరించింది. 2 సంవత్సరాల 11 నెలల 1 రోజు నుంచి 3 సంవత్సరాల వరకు గల డిపాజిట్లపై 6.45 శాతం నుంచి 6.55 శాతానికి పెంచింది. 3 సంవత్సరాల 1 రోజు నుంచి 4 సంవత్సరాల 7 నెలల లోపు వరకు గల డిపాజిట్లపై 6.50 శాతం నుంచి 6.60 శాతానికి పెంచింది. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

గత దీపావళి నుంచి అత్యధిక రాబడులు అందించిన మ్యూచువల్ ఫండ్లు ఇవే..!

గత దీపావళి నుంచి చేసిన సిప్ పెట్టుబడులపై దాదాపు 13 ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లు 15 శాతం కంటే ఎక్కువ రాబడిని అందించాయి. ఈ కాలంలో మొత్తం 295 ఫండ్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో 142 ఫండ్లు సానుకూల రాబడులను ఇవ్వగా, అత్యుత్తమ పనితీరు కనబరిచిన మొదటి మూడు ఫండ్లు 25 శాతం కంటే ఎక్కువ రాబడిని అందించాయి. మరోవైపు, 153 ఫండ్లు ప్రతికూల రాబడులను ఇచ్చాయి. గత దీపావళి నుంచి చేసిన సిప్ పెట్టుబడులపై సామ్కో స్మాల్ క్యాప్ ఫండ్ అత్యధికంగా 36.35% రాబడిని అందించింది. ఈ ఫండ్‌లో అక్టోబర్ 20, 2025 నుంచి నెలకు రూ. 10,000 చొప్పున సిప్ పెట్టుబడి పెట్టి ఉంటే, ప్రస్తుతం ఆ మొత్తం రూ. 1.25 లక్షలుగా ఉండేది. మోతీలాల్ ఓస్వాల్ ఫోకస్డ్ ఫండ్ ఈ కాలంలో సిప్ పెట్టుబడులపై 29.57% రాబడిని ఇచ్చింది. ఆ తర్వాతి స్థానాల్లో రెండు స్మాల్ క్యాప్ ఫండ్లు ఉన్నాయి. ఇందులో బ్యాంక్ ఆఫ్ ఇండియా స్మాల్ క్యాప్ 25.75 శాతం రాబడి ఇవ్వగా.. ట్రస్ట్ స్మల్ క్యాప్ ఫండ్ 24.53 శాతం రిటర్న్స్ ఇచ్చింది. మోతీలాల్ ఓస్వాల్ మల్టీక్యాప్ ఫండ్ సిప్ పెట్టుబడులపై ఇదే కాలంలో 22.82 శాతం రాబడి ఇచ్చింది. ఇన్వెస్కో ఇండియా ఫోకస్డ్ ఫండ్ 20.24 శాతం రాబడి ఇవ్వగా... హెలియస్ స్మాల్ క్యాప్ ఫండ్ 18.81 శాతం, మోతీలాల్ ఓస్వాల్ స్మాల్ క్యాప్ ఫండ్ 18.36 శాతం, ఐటీఐ స్మాల్ క్యాప్ ఫండ్ 18.08 శాతం, యూనియన్ స్మాల్ క్యాప్ ఫండ్ 15.75 శాతం, ఎల్ఐసీ ఎమ్ఎఫ్ స్మాల్ క్యాప్ ఫండ్ 15.69 శాతం రాబడులు ఇచ్చాయి. ఐదేళ్లలో అధిక రాబడి ఇచ్చిన మిడ్ క్యాప్ మ్యూచువల్ ఫండ్లు ఇవే..! సంవత్సర కాలంలో గ్రో మల్టిక్యాప్ ఫండ్ 15.55 శాతం, మహింద్రా మనులైఫ్ స్మాల్ క్యాప్ ఫండ్ 15.05 శాతం రాబడి ఇచ్చాయి. ఇదే కాలంలో సిప్ పెట్టుబడులపై టారస్ లార్జ్ క్యాప్ ఫండ్ 14.71% రాబడి అందించింది. ఇన్వెస్కో ఇండియా స్మాల్‌క్యాప్ ఫండ్, పీజీఐఎం ఇండియా స్మాల్ క్యాప్ ఫండ్ ఇదే కాలంలో సిప్ పెట్టుబడులపై ఒక్కొక్కటి 14.55% రాబడిని అందించాయి. క్వాంట్ స్మాల్ క్యాప్ ఫండ్ 11.42 శాతం, క్వాంట్ లార్జ్ ఉ మిడ్ క్యాప్ ఫండ్ 11.35% రాబడిని ఇచ



కిరణ్ అబ్బవరం 'హతః' విడుదల వాయిదా..
కొత్త రిలీజ్ డేట్ ఎప్పుడంటే?

టాలీవుడ్ యువ హీరో కిరణ్ అబ్బవరం నిర్మాతగా వ్యవహరిస్తున్న రంజ్ చిత్రం 'హతః' విడుదల వాయిదా పడింది. అనుష్ గోరెకి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే మంచి అంచనాలున్నాయి. అయితే, బాక్సాఫీస్ వద్ద ఇతర సినిమాల పోటీ ఎక్కువగా ఉండటం, ప్రేక్షకులకు థియేటర్లలో సరికొత్త, అత్యుత్తమ సౌండ్ అండ్ విజువల్ అనుభూతిని అందించాలనే ఉద్దేశంతో మేకర్స్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ చిత్రంలో కుషు సుద్దాల, రెహ్మాన్, సమ్రిత ఎంవి, తనూజ పుట్టస్వామి వదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. విభిన్నమైన కథాంశంతో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రస్తుతం తరుమేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే సరికొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని చిత్ర బృందం స్పష్టం చేసింది.

అఫిషీయల్.. రజనీకాంత్ 'ధర్మన్'లో శ్రీలీల!

సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ధర్మన్'. యువ దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా లెజెండరీ నటుడు కమల్ హాసన్‌కు చెందిన 'రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్' మరియు 'టర్బరిక్ మీడియా' బ్యానర్లు సంయుక్తంగా ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. కొద్దికాలంగా సోషల్ మీడియాలోనూ, సినీ వర్గాలలోనూ శ్రీలీల ఈ చిత్రంలో నటిస్తారనే వార్తలు జోరుగా ప్రచారంలో ఉన్నాయి. తాజాగా మేకర్స్ ఈ ఊహాగానాలన్నింటికీ తెరదించుతూ అధికారిక ప్రకటన విడుదల చేశారు. సోషల్ మీడియా వేదికగా ఓ ప్రత్యేక వీడియోను పంచుకుంటూ.. టాలెంటెడ్ నటి శ్రీలీల 'ధర్మన్' చిత్రంలో భాగం కాబోతున్నట్లు స్పష్టం చేశారు. ఈ చిత్రంలో రజనీకాంత్ ఇప్పటిపరకు చూడని విభిన్నమైన పాత్రలో వైద్యుడిగా (డాక్టర్) కనిపించనున్నట్లు తెలుస్తోంది. కేవలం రజనీకాంత్ మాత్రమే కాకుండా, ఈ సినిమాలో ఎంపిక చేసిన తారాగణం కూడా చాలా ప్రత్యేకంగా ఉంది. రామ్ పోతినేని, గ్లామరస్ నటి నిమ్రాన్, రాశీఖన్నా, స్టార్ హీరోయిన్ నయనతార, కమెడియన్ యోగిబాబు తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇంతమంది స్టార్స్ ఒకే సినిమాలో నటిస్తుండటంతో సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరాయి.



ఒకే శరీరంలో ఇద్దరు మనుషులు..
ఆసక్తికరంగా 'మాయ లేడీ' ట్రైలర్!

టాలీవుడ్‌లో వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరిస్తున్న రాకేష్ వర్రె ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మాయ లేడీ'. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన అఫీషియల్ తెలుగు ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ ట్రైలర్ చూస్తుంటే.. ఒకే శరీరంలో ఇద్దరు మనుషులు ఉంటే ఎలా ఉంటుంది అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా రాబోతుంది. ఫుల్ టైం కామెడీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమా ట్రైలర్ ప్రస్తుతం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. రాకేష్ వర్రె మరియు మధుమితల నటన, విజువల్స్ మరియు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ సినిమాపై అంచనాలను భారీగా పెంచేశాయి. సెప్టెంబర్ 19న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం సైకలాజికల్ థ్రిల్లర్ కోసర్ ఎదురుచూసేవారికి మంచి విజువల్ ట్రీట్ ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది.



మిక్స్‌డ్ టాక్‌ను తట్టుకుని నిలబడిన 'రణబాలి'..
బాక్సాఫీస్ వద్ద రూ.82 కోట్ల గ్రాస్ కలెక్షన్లు!

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో భారీ అంచనాల మధ్య విడుదలైన 'రణబాలి' చిత్రం బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతోంది. సినిమా విడుదలైన ప్రారంభంలో కొన్ని మిక్స్‌డ్ టాక్ మరియు ఫిస్ల స్పందనలు వచ్చినప్పటికీ, వీకెండ్స్ మరియు పర్సింగ్ డేస్‌లోనూ సినిమా వసూళ్లు మాత్రం ఎక్కడా తగ్గకుండా నిలకడగా కొనసాగుతున్నాయి. చిత్రానికి ఉన్న క్రేజ్ మరియు బీ, సీ సెంటర్స్ లో లభిస్తున్న ఆదరణ బాగుండటంతో కలెక్షన్లు స్థిరంగా వస్తున్నట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. అలాగే ట్రేడ్ నిపుణుల ప్రకారం, ఈ చిత్రం ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 82 కోట్ల వరకు గ్రాస్ వసూళ్లను సాధించినట్లు అంచనా వేస్తున్నారు. థియేట్రికల్ రన్‌తో పాటు ఈ సినిమా నాన్-థియేట్రికల్ బిజినెస్ కూడా భారీ స్థాయిలోనే జరిగినట్లు తెలుస్తోంది. శాటిలైట్, డిజిటల్ (ఓటీటీ) మరియు ఆడియో రైట్స్ రూపంలో నాన్-థియేట్రికల్ బిజినెస్ ద్వారా సుమారు రూ. 85 కోట్లు రాబట్టినట్లు సమాచారం.



'మహంతి ఝాన్సీ రాణి అనే నేను'..
కింగ్100 టబు గ్లింప్స్

అక్కినేని నాగార్జున 100 వ చిత్రం 'కింగ్ 100'. ఈ సినిమా నుంచి ఆసక్తికర అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న సీనియర్ నటి టబు స్పెషల్ గ్లింప్స్‌ను విడుదల చేసింది చిత్రబృందం. టబు పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రత్యేక వీడియోను విడుదల చేశారు. 'మనుషుల్లో రెండు రూలు.. కష్టాన్ని నమ్మేవాళ్లు, అదృష్టాన్ని నమ్మేవాళ్లు ...' 'మహంతి ఝాన్సీ రాణి అనే నేను'.. అంటూ ఆమె చెప్పే డైలాగ్ సినిమాపై అంచనాలు పెంచేస్తోంది. ఈ సినిమాకి దేవీశ్రీ ప్రసాద్ గట్టిగానే మ్యూజిక్ అందించినట్లు గ్లింప్స్ చూస్తే అర్థమవుతోంది. ఆర్. కార్తిక్ దర్శకత్వంలో అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తున్న 'కింగ్ 100' డిసెంబర్ 24 న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. నాగార్జున 100వ చిత్రం కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన తొలి గ్లింప్స్ కూడా ఆకట్టుకుంది.

M/S ACHUKATLA PUBLICATIONS D.NO. 9/1542, M.R. ROAD, GOOTY RS, ANANTHAPUR, ANDHRA PRADESH - 515402.